ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు



ఆ ఖాకీల్లో.. కలవరం

పోలీసులమనే విషయం మరిచారు. వైసీపీ నేతలకంటే ఎక్కువగా బరితెగించారు. రాజ్యాంగం.. ప్రజాస్వామ్యం.. కోర్టులను పట్టించుకోలేదు. ఐపీసీ కాదు.. వైసీపీ ముఖ్య మన్నట్లుగా చెలరేగారు. వైసీపీ నేతలు చెప్పడమే ఆలస్య మన్నట్లుగా కేసులు.. అరెస్టులతో చిత్రహింసలకు పాల్పడ్డారు. అన్యాయం జరిగింది అన్నా కూడా ప్రతిపక్షాలతో ముడిపెట్టి వారికి న్యాయం చేయలేదు. వైసీపీ శ్రేణులు చంపేస్తున్నాయి.. రక్షించండి అంటూ పోలీసు స్టేషన్లకు వెళ్లినా పట్టించుకోకపోగా ఊర్లు వదిలి వెళ్లిపోండనే సలహాలతో సరి పెట్టారు. మరికొందరు పోలీసులైతే వైసీపీ వారిపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ ఎదురు కేసులతో హింసించారు. ఐదేళ్ల ఖాకీరాజ్యంలో సామాన్యుల నుంచి ప్రతిపక్షా నేతల వరకు కనీసం మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా పోయింది. కొందరు ఎస్ఐలు, సీఐలే కాదు డీఎస్పీలు, ఐపీఎస్‌ల వరకు అధికార పార్టీ నేతలఆదేశాలకు అనుగుణంగా వైసీపీ చట్టం అమలు చేసేందుకు పోటీలు పడ్డారు. సామాన్యులు పోలీస్ స్టేషన్లకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని ధీమాతో బరితెగించిన పోలీసుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో కలవరం మొదలైంది.

గుంటూరు, జూన్ 6: ఐదేళ్ల ఖాకీరాజ్యానికి.. ఐపీసీకి బదులు అమలైన వైసీపీ చట్టానికి చెక్ పడింది. ఐదేళ్ల అరాచక పర్వానికి తెరపడింది. టీడీపీ, జనసేన కార్యకర్తలకే గాక సామాన్య ప్రజలకు కూడా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభించాయి. వైసీపీ పాలనలో ఐదేళ్ల చట్టం, న్యాయంతో పని లేకుండా అధికార పార్టీ నేతలు ఏది చెప్తే అదే అమలు చేసిన పోలీసుల్లో కలవరం మొదలైంది. బాధితులపైనే తప్పుడు కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేసిన వారు ఇప్పుడు ఎలా తప్పించుకోవాలా అన్న మీమాంశలో పడిపోయారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అధికార పార్టీ నేతల ఆదేశాలతో కొందరు పోలీసులు వైసీపీ కార్యకర్తలు లాగా వేధింపులకు పాల్పడ్డారు. మరికొందరు అధికార పార్టీ నేతల మెప్పుకోసం అతిగా వ్యవహరించారు. అనేకమంది పోలీస్ అధికారులు మూడు సింహాలు సిగ్గుపడేలా ఐపీసీని వైసీపీగా మార్చి అరాచకాలకు పాల్పడ్డారు. ఈ జాబితాలో అనేకమంది ఎస్పీల నుంచి సీఐలు, ఎస్ఐలు, డీఎస్పీలు ఉన్నారు. అయితే వారంతా ఇప్పుడు టీడీపీ నాయకులు భావిస్తున్నట్లు భయపడటం లేదు. టీడీపీలో తమకు తెలిసిన నాయకుల ద్వారా ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. దారుణంగా అరాచకానికి పాల్పడి హిట్ లిస్టులో ఉన్న వారిలో మాత్రం కొంతవరకు కలవరం కనపడుతుంది. దీంతో వారు రాబోయే ప్రభుత్వం ఈ దఫా ఎలా వ్యవహరించబోతుందోననే ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. వైసీపీ హయాంలో కీలకమైన స్థానాల్లో ఉన్నవారు టీడీపీ, వైసీపీ వారి ఫోన్లు కూడా తీయకుండా, పలు సందర్భాల్లో కనీస గౌరవం కూడా ఇవ్వకుండా ఏకవచనంతో పిలుస్తూ దారుణంగా వ్యవహరించారు.

కార్యకర్తల్లో పెల్లుబికుతున్న ఆగ్రహం

గడిచిన ఐదేళ్లలో నెలకొన్న దారుణ పరిస్థితులను తలుచుకుని టీడీపీ, వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధిస్తూ కౌంటింగ్ సందర్భంగా ట్రెండ్ కొనసాగుతున్న సమయంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు అటు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, విడదల రజిని కార్యాలయాలపై దాడికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. ఈ సందర్భంగా కార్యకర్తలు వ్యవహరించిన తీరు గడిచిన 5 ఏళ్లలో వారు ఎదుర్కొన్న అణచివేత ప్రస్ఫుటంగా కనిపించింది. పోలీసులు లాఠీచార్జి చేస్తామన్న కార్యకర్తలు ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. ఐదేళ్ల ఈ లాఠీలు ఏమయ్యాయని, ఎక్కడ దాచి పెట్టారంటూ అధికారులను సైతం నిలదీశారు. గడచిన ఐదేళ్ల తమకు నరకం చూపించారని ఇప్పుడు కూడా తమను వేధిస్తామంటే సహించేది లేదంటూ ఎదురు తిరిగారు. తమను, సామాన్య ప్రజలను గడిచిన ఐదేళ్లలో వేధించిన ఏ పోలీస్ అధికారిని సహించేది లేదని వారికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వకపోవడమే కాక వారి వేధింపులపై సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రానున్న కొద్ది రోజుల్లో ప్రభుత్వ పాలనలో కీలకంగా మారిన పోలీస్ శాఖలో ప్రభుత్వ వైఖరి ఎలా ఉండబోతుందనే దానిపై అటు పోలీసు వర్గాల్లోను, ఇటు టీడీపీ, జనసేన కార్యకర్తల్లోనూ ఆసక్తి నెలకొంది.


వైసీపీ కార్యాలయాల్లా పోలీస్‌స్టేషన్లు

ఐదేళ్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లు వైసీపీ కార్యాలయాల మారాయంటే ఆశ్చర్యం కాదు. అధికార పార్టీ బాధితులు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే అప్పటికే వారు అక్కడ ఉండటం.. వారే పోలీసులకు ఆదేశాలు జారీ చేయడం వాటిని ఆయా అధికారులు అమలు చేయడం సర్వసాధారణంగా మారింది. ఇక ప్రైవేటు పంచాయతీలు చేసే కేంద్రాలుగా పోలీసు స్టేషన్లను మార్చారనే అభియోగాలు వచ్చాయి. అధికార పార్టీ ల్యాండ్ మాఫియా చెప్పిందే ఖాకీలు తూచా తప్పకుండా పాటించారు. ఇదే అదునుగా పోలీస్ స్టేషన్లలో అవినీతి తాండవించింది. కేసు నమోదు చేయాలన్నా డబ్బులు, చేయకుండా ఉండాలన్నా డబ్బులు ఉండాల్సిందే. స్టేషన్ బెయిల్ ఇవ్వాలన్నా, కోర్టులో హాజరు పరచాలన్నా డబ్బులే. పోలీసు గడప తొక్కాలంటే జేబులో డబ్బులు కట్టలైనా ఉండాలి లేదంటే అధికార పార్టీ నేతల సిఫార్సు అయినా ఉండాలి. ఐదేళ్ల ఇలా ఖాకీ రాజ్యం సాగింది.

ప్రశ్నిస్తే కేసులు.. అరెస్టులు

అధికార పార్టీని కానీ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గాని ప్రశ్నించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా సీఐడీ అధికారులు రాత్రి, పగలు తేడా లేకుండా ఆడ, మగ చూడకుండా, వయసుతో సంబంధం లేకుండా అరెస్టులు, విచారణల పేరుతో వేధింపులకు గురి చేశారు. వెంగళరావు, దారపునేని నరేంద్ర లాంటి టీడీపీ కార్యకర్తల నుంచి రంగనాయకమ్మ అనే కామన్ మ్యాన్ వరకు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్బంధాలు... వేధింపులకు గురయ్యారు. అధికార పార్టీ ఎంపీగా ఉన్న రఘురామకృష్ణంరాజు అరెస్టు నుంచి తప్పుడు కేసులలో టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, బండారు సత్యనారాయణమూర్తి, అయ్యన్నపాత్రుడు వంటి వారందరి విచారణకు గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయం వేదికగా నిలిచింది. రాజధానిలో దళిత రైతులపైనే ఎస్సీ ఎస్టీ కేసులు బనాయించి వారాల తరబడి జైళ్లలో నిర్బంధించారు. అనేక మంది వృద్ధులైన రాజదాని రైతులపై కూడా తప్పుడు కేసులు బనాయించి జైళ్లకు పంపారు. రాజధాని మహిళా రైతులపై అత్యంత కర్కశంగా లాఠీలతో విరుచుకుపడ్డారు.





పోలీసుల్లోనూ ఐదేళ్లుగా కొందరికి నరకం

గడిచిన ఐదేళ్ల అధికార పార్టీ నేతల వేధింపులు, పోస్టింగుల్లో వివక్షతో కొందరు పోలీసులు నరకం చూశారు. కొంతమంది స్వచ్ఛందంగా వలంటరీ రిటైర్మెంట్ ఇచ్చి వెళ్లే పరిస్థితికి తీసుకొచ్చారు. పలువురిపై తప్పుడు కేసులు బనాయించారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించే వారిని కూడా వదలకుండా పోస్టింగ్స్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచుతూ జీతం కూడా రానివ్వకుండా వేధింపులకు గురి చేశారు. చివరకు ఎన్నికలు విధులే కాకుండా సాధారణ బందోబస్తుల్లోనూ కీలక బాధ్యతలు అప్పగించకుండా ఎన్నో రకాలుగా వేధింపులకు గురిచేశారు. ఒకరిద్దరూ నిష్పక్షపాతంగా పనిచేసే వారు ఉన్నతాధికారుల మెప్పు పొంది జీతం కోసం లూప్‌లైన్ పోస్టింగ్ తెచ్చుకున్నప్పటికీ విషయం తెలుసుకుని వారిని అక్కడ కూడా ఉండనివ్వకుండా తరిమేశారు. ఈ పరిణామాలతో ఆ వర్గం పోలీసులు తీవ్ర మానసిక ఒత్తిడికి, ఆందోళనకు, ఆవేదనకు లోనయ్యారు. అలాగే వారితో పాటు టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్న వారిని కూడా పోస్టింగ్‌కు దూరంగా ఉంచారు. ఈ విధంగా తమ సర్వీసులో ఎన్నడూ చూడని విధంగా గడిచిన ఐదేళ్లలో వారికి నరకం చూపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో ఈసారైనా తమకు సముచిత స్థానం వస్తుందనే ఆశతో వారు ఎదురుచూస్తున్నారు.

- ఎస్ఐల నుంచి ఐపీఎస్‌ల వరకు బరితెగింపు
- వైసీపీ చట్టం అమలు చేయడంలో పలువురు పోటీ
- కోడ్ ముందు వరకు వారు ఆడిందే ఆట.. పాడిందే పాట
- టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాల్లో వారు
- నాడు ఇబ్బందులు ఎదుర్కొన్న పోలీసులకు సముచిత స్థానం దక్కేనా?

ఖాకీరాజ్యంలో అరాచకం

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఖాకీరాజ్యం కొనసాగింది. పల్నాడులో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. టీడీపీలో చురుగ్గా తిరుగుతుంటే చాలు ఎస్ఐలు, సీఐలు వారిని స్టేషన్లకు పిలిపించి వైసీపీ కండువా అయినా కప్పుకోండి లేదంటే ఊరు వదిలిపెట్టి వెళ్లిపోండి అంటూ నేరుగా బెదిరింపులకు దిగారు. లేదంటే అక్రమ మద్యం, హత్యాయత్నం వంటి కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని, రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అంతేకాక వారి మాట వినని వారిపై హెచ్చరించినట్లుగానే తప్పుడు కేసులు బనాయించి స్టేషన్లో లాఠీ కౌన్సెలింగ్ ఇచ్చి వేధింపులకు గురి చేశారు. నెలలు తరబడి జైళ్లలో మగ్గిపోయేలా చేశారు. అంతేకాక అనేక గ్రామాల్లో టీడీపీలో చురుగ్గా పనిచేసే నాయకులు, కార్యకర్తల హత్యల వెనుక పోలీసుల ఉదాశీన వైఖరి కూడా స్పష్టంగా కనిపించింది. ఏ కారణం లేకుండానే పార్టీ నాయకులను, కార్యకర్తలను స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురి చేశారు. అనేక గ్రామాల్లో వైసీపీ గుండాల అరాచకాలకు టీడీపీ వర్గీయులు ఊళ్ల వదిలి పెట్టి వెళ్లిపోయారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఎక్కడా వారిని కట్టడి చేయకపోగా టీడీపీ వారిపైనే వేధింపులకు పాల్పడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపైనా, టీడీపీ కేంద్ర కార్యాలయంపైనా ఒక రోజు ముందే హెచ్చరించి యదేచ్ఛగా దాడులకు పాల్పడ్డారు. రాజధానిలో చంద్రబాబు బస్సు యాత్ర చేస్తుంటే పోలీసుల సహకారంతోనే ఆయనపై దాడికి యత్నించడం, రాళ్ళు కర్రలతో బస్సుపై దాడి చేయడం, మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్న, న్యాయవాది పారా కిశోర్‌లపై హత్యాయత్నం, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ నేతల మాదిరిగా బరితెగించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం వంటి దుర్మార్గ చర్యల్లో పోలీసులే కీలకంగా వ్యవహరించారు. పల్నాడులో వైసీపీ నాయకుల కంటే కూడా పోలీసులను చూస్తేనే టీడీపీ కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారంటే వారి పని తీరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

సిఫార్సు బదిలీలకు చెక్

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇలాంటివి 70పైనే
- ఒక్కో బదిలీకి రూ.4 లక్షల వరకు ముడుపులు వసూలు
- పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు 40 మంది బదిలీ
- తాడేపల్లి ఎమార్సీలో చక్రం తిప్పిన ఓ ఉపాధ్యాయుడు
- అక్రమ బదిలీలపై ఆందోళనలను పట్టించుకోని అప్పటి ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం అధికారం.. అక్రమ బదిలీల రద్దుకు ఆదేశాలు

గుంటూరు(విద్య), జూన్ 6: ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీలను నిలిపివేస్తూ కొత్త ప్రభుత్వం బ్రేక్ వేసింది. దీంతో సిఫార్సులతో ముడుపులు ఇచ్చి బదిలీలు చేయించుకున్న ఉపాధ్యాయుల నెత్తిన పచ్చివెలక్కాయ పడింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సిఫార్సు బదిలీలు దాదాపు 70పైగానే ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఇందులో అత్యధిక మంది పల్నాడు తదితర ప్రాంతాల నుంచి గుంటూరు జిల్లాలోని నాలుగు మున్సిపల్ కేంద్రాల్లోకి బదిలీలు తెచ్చుకున్నారు. ఇలా సిఫార్సు బదిలీ కోసం ఒక్కో ఉపాధ్యాయుడు రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 14 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేసింది. నాలుగేళ్లలో ఒకసారి ఏదో తూతూమంత్రంగా బదిలీలు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మరోవైపు యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చింది. దీంతో అనేక మంది స్వచ్ఛంద ఉద్యోగ విరమణతో బడికి దూరమయ్యారు. దీంతో అనేక ప్రాంతాల్లో ఉపాధ్యాయు ల కొరత తీవ్రస్థాయిలో ఏర్పడింది. అనేక పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల సమయంలో కూడా సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన వచ్చింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్‌లో విడతల వారీగా దాదాపు 70పైగా సిఫార్సు బదిలీలు జరిగాయి. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రస్థాయిలో ఆందోళన చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఈ బదిలీలకు తాత్కలికంగా బ్రేక్ పడింది. ఒక్కో బదిలీకి భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అక్రమ బదిలీలు, పరస్పర ఒప్పంద(మ్యూచువల్ బదిలీలు) తాడపల్లిలోని ఓ ఎమ్మార్సీ నుంచి ప్రారంభమయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ దాదాపు 15 ఏళ్లుగా ఉన్న ఓ ఉపాధ్యాయుడు ఇటువంటి అక్రమాలు చేయడంతో సిద్ధహస్తుడనే ఆరోపణ ఉంది. ఆయన నేరుగా విద్యాశాఖ పేషీలో చక్రం తిప్ప అక్రమ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇప్పించే వాడని ప్రచారం ఉంది. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈలోగా కొత్త ప్రభుత్వం కొలువు దీరనుంది. ఈ క్రమంలో సిఫార్సు బదిలీలు రద్దయ్యే పరిస్థితి నెలకొంది. ఈ చర్యపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



అమాత్యులు.. అయ్యేదెవరో?



- మంత్రి పదవుల రేసులో పలువురు సీనియర్లు
- జనసేన కోటాలో మనోహర్‌కి ఛాన్స్ దక్కే అవకాశం
- ఆశావహుల్లో ఆరోసారి గెలుపొందిన కన్నా, నరేంద్ర
- ఎస్సీ కోటాలో ఆ ముగ్గురిలో ఎవరి ప్రయత్నాలు ఫలించేనో

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనట్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 17 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలుపొందారు. టీడీపీ సీనియర్లు అందరూ విజేతలుగా నిలిచారు. దీంతో కూటమి ప్రభుత్వంలో మంత్రి పదవులపై అందరూ ఆశపడుతున్నారు. రాజధాని ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ పర్యాయం చాలామంది మంత్రి పదవులు ఆశిస్తూ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు. 2014లో టీడీపీ గెలుపొందిన సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట) మంత్రి పదవిని చేపట్టి ఐదేళ్ల కొనసాగారు. అయితే ఎస్సీ కోటాలో తొలుత మంత్రి పదవి దక్కించుకున్న రావెల కిశోర్‌బాబు(ప్రత్తిపాడు) రెండున్నరేళ్లే ఉన్నారు. ఆ తర్వాత ఆయన్ను తప్పించగా నక్కా ఆనందబాబు(వేమూరు)ను అమాత్య పదవి వరించింది. రాబోయే ప్రభుత్వంలో ప్రత్తిపాటితో పాటు ఆనందబాబులు ఇద్దరూ రేసులో ఉన్నారు. ఇక పొన్నూరు నుంచి ఆరోసారి గెలిచిన ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబును ఓడించిన సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. ఆయనకు గతంలో వివిధ శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. అలాగే రేపల్లె నుంచి మూడో సారి విజయం సాధించిన అనగాని సత్యప్రసాద్ కూడా బీసీ కోటాలో మంత్రి పదవిని ఆశిస్తున్నారు. కాగా ఈ పర్యాయం తాడికొండ, ప్రత్తిపాడు ఎస్సీ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు కూడా మంత్రి పదవులను ఆశిస్తున్నారు. శ్రావణ్‌కుమార్ రాజధాని ప్రాంత ఎమ్మెల్యే కావడమే కాకుండా రెండో సారి గెలిచిన సీనియార్టీ కూడా తనకుందనే భావనలో ఉన్నారు. ఇక ప్రత్తిపాడు నుంచి గెలుపొందిన రామాంజనేయులు సీనియర్ ఐఏఎస్ అధికారిగా తనకున్న అనుభవం మూలంగా గెలిచింది మొదటి సారే అయినా తన పేరు కూడా పరిశీలనలో ఉంటుందనే భావనలో ఉన్నారు. ఇక గుంటూరులో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తొలిసారే అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నప్పటికీ వారు కూడా మంత్రి పదవులు ఆశిస్తున్నారు. మంత్రి విడదల రజినీని ఓడించి 51 వేలకు పైగా మెజార్టీతో ప్రతిష్టాత్మకమైన విజయం సాధించడం మూలంగా తన పేరు కూడా పరిశీలనలో ఉంటుందని గళ్ళా మాధవి ఆశలో ఉన్నారు. తూర్పు నుంచి గెలిచిన ఎండీ నసీర్ అహ్మద్ రెండు దశాబ్దాల తర్వాత నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేసిన తన పేరును సామాజిక అంశం కోణంలో పరిశీలించే అవకాశం ఉందనే ఆశలో ఉన్నారు. ఇక పల్నాడు జిల్లాలో మంత్రి పదవుల రేసులో మరికొందరు సీనియర్లు ఉన్నారు. నిన్న మొన్నటి దాకా పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా పనిచేసి మూడో సారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్న వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కూడా అమాత్య పదవి తనను వరిస్తుందనే ఆశలో ఉన్నారు. అలాగే గురజాల నియోజకవర్గం నుం చి నాలుగోసారి విజయఢంకా మోగించిన యరపతినేని శ్రీనివాసరావు తాను తప్పనిసరిగా సీఎం చంద్రబాబు కేబినెట్‌లో ఉంటాననే ధీమాతో ఉన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరాచకాలకు అడ్డుకట్ట వేసి ప్రతిష్టాత్మకమైన విజయం సాధించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కూడా తాను గెలిచింది మొదటిసారే అయినా అక్కడి పరిస్థితుల దృష్ట్యా మంత్రి పదవిని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందనే భావనలో ఉన్నారు. పైగా పల్నాడు జిల్లాలో బ్రహ్మారెడ్డే అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు.

పని ఒకరిది.. బిల్లు మరొకరికి

- వైసీపీ నేతకు రూ.10 లక్షల బిల్లు చెల్లింపు
- నగదు ఇవ్వకుంటే ఏఈపై కేసు పెడతానన్న కాంట్రాక్టర్
- పల్నాడులో వెలుగులోకి వస్తున్న వైసీపీ ఆర్థిక అరాచకాలు

నరసరావుపేట, జూన్ 6: అధికారం ఉంది.. వచ్చేదీ తమ ప్రభుత్వమే అనే ధీమాతో ఐదేళ్లుగా పల్నాడులో ఆర్థిక అరాచకాలకు పాల్పడిన వారు తాజా పరిణామాలతో హతాశులవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ తిమింగలాలపై బాధితులు తిరుగుబాటు చేస్తున్నారు. వైసీపీ ఆర్థిక అరాచకాలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. తమ నుంచి రూ.లక్షలు వసూలు చేశారు.. వాటిని కక్కాల్సిందేనంటూ బాధితులు డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ హయాంలో అటు అధికారులు, ఇటు నాయకులు అడిగినంత ముట్టచెప్పుకున్న వారు రెండు రోజులుగా తిరుగుబాట చేస్తున్నారు. పూడా వైఎస్ చైర్మన్ తమను బెదిరించి రూ.లక్షలకు లక్షలు వసూలు తీసుకున్నాడు.. ఆ డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ రియాల్టర్లు కొందరు గురువారం పూడా కార్యాలయానికి వెళ్లి ఏకంగా వైఎస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డిని నిలదీయడం ఆయన అప్పటికప్పుడు రూ.50 లక్షలు తెచ్చి ఇవ్వడం తెలిసిందే. శుక్రవారం కూడా మరికొందరు రియల్టర్లు పూడా కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం నరసరావుపేటకు చెందిన బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు కూడా తమ నుంచి వైసీపీ నాయకులు లక్షలు వసూలు చేశారని ఆ మొత్తాలను వడ్డీతో సహా కక్కాల్సిందేనని లేదంటే వదలమంటూ వారికి ఫోన్లు చేసి డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పంచాయతీ ఏఈ చేసిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రొంపిచర్ల మండలం గోగులపాడులో టీడీపీ హయాంలో ఓ కాంట్రాక్టర్ ఉపాధి హామీ పథకం కింద ఓ భవనం నిర్మించారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ కాంట్రాక్టర్‌కు బిల్లును నిలిపివేశారు. ఆ తర్వాత బిల్లు చెల్లింపు ప్రక్రియ మొదలుపెట్టిన ఏఈ గోగులపాడుకు చెందిన ఓ వైసీపీ నేతకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. తాను పని చేస్తే వైసీపీకి చెందిన వ్యక్తికి బిల్లు చేయడంపై సంబంధిత టీడీపీ కాంట్రాక్టర్ ఇంతకాలం మౌనంగా ఉన్నారు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో సదరు ఏఈని బాధిత కాంట్రాక్టర్ గురువారం నిలదీసి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఏఈతో టీడీపీ నేతలు పంచాయితీ చేశారు. రెండు రోజుల్లో రూ.10 లక్షలు చెల్లిస్తానని ఏఈ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించారని, అలా చెల్లించకపోతే ఏఈపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ నేతలు తెలిపారు.

వైసీపీ నేతలకు బార్ల నిర్వాహకుల హెచ్చరిక

వైసీపీ హయాంలో తమను బెదిరించి వైసీపీ నేతలు కొట్టేసిన డబ్బు కక్కించేందుకు టీడీపీ, జనసేనలకు చెందిన బార్ల నిర్వాహకులు సిద్ధమయ్యారు. దాదాపు రూ.1.25 కోట్లు వైసీపీ నేతలు వసూలు చేశారని, ఎవరైతే తమ వద్ద డబ్బు తీసుకువెళ్లారో సదరు నేతలు ఆ సొమ్ములను వెనక్కు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తనను బెదిరించి రూ.20 లక్షలు తీసుకున్న ఓ వైసీపీ నేతకు ఓ బార్ నిర్వాహకుడు ఫోన్ చేసి ఆ మొత్తాన్ని వడ్డీతో సహా తెచ్చి ఇవ్వాలని కోరాడు. తాను ఒక్కడ్నే నగదు తీసుకోలేదని ఆ నేత సమాధానం ఇవ్వడంతో తన దగ్గర డబ్బు తీసుకు వెళ్లింది నువ్వే కాబట్టి ఆ మొత్తం నువ్వే ఇవ్వాలని లేకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఓ బార్ నిర్వాహకుడి వద్ద రూ.40 లక్షలు, మరో వ్యాపారి వద్ద రూ.25 లక్షలు, మరో వ్యక్తి వద్ద రూ.15 లక్షలు వైసీపీ నేతలు వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. వీరందరూ కొట్టేసిన డబ్బు తిరిగి ఇవ్వాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



ఆ విశ్వాసం పవన్ కళ్లలో కనిపించింది

పరుచూరి గోపాలకృష్ణ



ఆంధ్రప్రదేశ్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో అసాధారణ విజయం సొంతం చేసుకున్న కూటమికి చిత్ర పరిశ్రమ నుంచి శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. ఈ సందర్భంగా రచయిత పరుచూరి గోపాలకృష్ణ చంద్రబాబుకి, పవన్‌కల్యాణ్‌కు అభినంద నలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పవన్‌కల్యాణ్‌ను ప్రశంసిస్తూ 'పవన్‌కు బిడియం ఎక్కువ. కానీ ఈ ఎన్నికల కోసం ఎంతో ఆత్మవిశ్వాసంతో పని చేశారు. 'నేను సాధిస్తున్నా' అనే విశ్వాసం ఆయన కళ్లల్లో కనిపించింది. పవన్‌కల్యాణ్ అభిమానులు ఎంత ఎమోషనల్‌గా ఉంటారో నాకు తెలుసు. కూటమి ఏర్పాటులో పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషించి, ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన తర్వాత కూడా ఆయన ఎంతో విన యంగా ఎవరినీ నిందించకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలా అనే ఆలో చనతోనే మాట్లాడారు. అది పవన్ గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం' అన్నారు.

అందరినీ ఆకట్టుకుంటుంది



'గూఢచారి', 'మేజర్' చిత్రాలతో దర్శకుడిగా టాలీవుడ్‌లో తనదైన ముద్రవేశారు శశి కిరణ్‌తిక్క. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' సినిమాకు ఆయన స్ర్కీన్‌ప్లే అందించడమే కాకుండా సమర్పకులుగా వ్యవహరించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా శశి కిరణ్‌తిక్క మీడియాతో ముచ్చటించారు "ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. థియేటర్స్‌లో సినిమాను చూసేటప్పుడు ఇందులోని ఎమోషన్స్‌తో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారు. దర్శకుడు సుమన్ సినిమాను గ్రిప్పింగ్‌గా తీసిన విధానం, కాజల్ ఎనర్జిటిక్ యాక్టింగ్, శ్రీ చరణ్ సంగీతం ఈ సినిమాకు పెద్ద హైలైట్స్" అని చెప్పారు.

క్లీన్ చిట్ వచ్చే వరకూ..



బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్ట్ అయిన నటి హేమను మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) గురువారం సస్పెండ్ చేసింది. డ్రగ్స్ కేసుపై వివరణ ఇవ్వాలని హేమకు నోటీసు పంపించినా ఆమె స్పందించకపోవడంతో 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో హేమకు క్లీన్ చిట్ వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని 'మా' కార్యవర్గం తెలిపింది.

బ్లాక్‌బస్టర్ గ్యారంటీ



శర్వానంద్, కృతి శెట్టి హీరోహీరోయన్లుగా నటించిన చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించగా, టీ.జీ.విశ్వ ప్రసాద్ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ "ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ గ్యారంటీ" అని చెప్పారు. "కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ అన్నారు.













గోరంట్ల దేవాలయంలో మొక్కులు తీర్చుకుంటున్న రాజధాని మహిళలతో శ్రావణ్‌కుమార్

మొక్కులు తీర్చుకున్న రాజధాని మహిళలు

● సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

గుంటూరు సిటీ, జూన్ 6: గుంటూరు నగరంలోని గోరంట్ల వేంకటేశ్వరునికి రాజధాని మహిళలు గురువారం మొక్కులు తీర్చుకున్నారు.మోతడక, నిడుముక్కల గ్రామాలకు చెందిన మహిళలు పాదయాత్ర చేస్తూ గోరంట్ల వేంకటేశ్వరుని గుడికి చేరుకున్నారు. ఎక్కువ సంఖ్యలో మహిళలు తరలిరావడంతో గుడి ప్రాంగణం కిక్కిరిసిపోయింది.ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. తాటికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని రైతుల పోరాటం మరువ లేనిదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మోతడక సర్పంచ్ యడ్లపల్లి పార్వతి, సాంబశివరావు, నిడుముక్కల టీడీపీ నేతలు చిగురుపాటి అణుపు, తలసల ప్రసన్నకుమార్, గోరంట్ల వెంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, ఆతుకూరి వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి బసవరాజు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 20 మందిపై కేసు

యడ్లపాడు, జూన్ 6: టీడీపీ వర్గీయులపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడిన ఘటనలో 20 మందిపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు. ఓట్ల లెక్కింపు తేదీ 4న పార్టీ విజయం సాధించడంతో టీడీపీ వర్గీయులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య స్వల్ప వివాదం ఏర్పడగా ఒకరినొకరు తోసుకున్నారు. ఇంతలో వైసీపీ వర్గీయులు రాళ్ళు విసరడంతో టీడీపీకి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. దీనితో దాడికి పాల్పడిన తుమ్మపూడి మరియబాబుతోపాటు మరో 17మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదే విషయమై మహిళల మధ్య మరోసారి గొడవ జరగడంతో నలుగురు మహిళలపై కూడా మరో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అయితే నలుగురు మహిళల్లో ఇద్దరు మొదటి కేసులో కూడా ముద్దాయిలుగా ఉన్నారన్నారు. దాడిలో ప్రమేయమున్న అందరినీ అరెస్ట్‌చేసి చిలకలూరిపేట కోర్టులో గురువారం హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు. తమపై కూడా దాడి జరిగిందంటూ వైసీపీ వర్గీయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12మంది టీడీపీ వర్గీయులపై కేసు నమోదుచేసినట్లు వెల్లడించారు.



విలేకరులతో మాట్లాడుతున్న అడిషనల్ ఏఎస్పీ హనుమంతురావు

గృహాల ధ్వంసం కేసులో 20 మంది అరెస్టు

● అడిషనల్ ఎస్పీ హనుమంతురావు

దుర్గి, జూన్ 6: మండలంలోని జంగమహేశ్వరపాడులో బుధవారం జరిగిన గృహాల ధ్వంసం కేసులో 20 మందిని అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ హనుమంతురావు తెలిపారు. గురువారం దుర్గి పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల అనంతరం వైసీపీ సానుభూతిపరులు దాడులకు భయపడి గ్రామాలు విడిచి 70 టీడీపీ కుటుంబాలు గ్రామం విడిచి వేరే కుటుంబాల్లో జీవిస్తున్నారు. కౌంటింగ్ అనంతరం టీడీపీ విజయోత్సవం అనంతరం గ్రామంలోని తమ గృహాలకు వచ్చారు. గృహాలు ధ్వంసం అవడాన్ని గుర్తించి ఆగ్రహంతో వైసీపీ సానుభూతిపరుల గృహాలను ధ్వంసం చేశారు. కారంపూడిలో పోలింగ్ మరుసటి రోజున హింసాత్మక ఘటనలో పాల్గొన్న వైసీపీ సానుభూతిపరులు గ్రామంలో లేకపోవడంతో వారి గృహాలను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. టీడీపీకి చెందిన 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పీ హనుమంతురావు తెలిపారు.

నృసింహునికి లోకేశ్, బ్రాహ్మణి ప్రత్యేక పూజలు

● ఎగువ, దిగువ సన్నిధి ఆలయాల్లో స్వామి వారి దర్శనం

మంగళగిరి, జూన్6: మంగళగిరి నియోజకవర్గం నుంచి అఖండ మెజార్టీతో విజయం సాధించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా గురువారం సాయంత్రం మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. సతీమణి బ్రాహ్మణితో కలిసి నారా లోకేశ్ శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత దిగువ సన్నిధిలోని తూర్పు రాజగోపురం వద్ద దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎ.రామకోటిరెడ్డి, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ముఖమండపంలో లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈవో రామకోటిరెడ్డి నృసింహుని చిత్రపటంతో కూడిన జ్ఞాపికను బహూకరించారు.



... దిగువ సన్నిధిలో ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, నేతలు గుత్తికొండ ధనుంజయరావు, షేక్ రియాజ్, గాజుల శ్రీనివాసరావు, గోవాడ దుర్గారావు, సంకా బాలాజీగుప్తా, జొన్నాదుల బాలకృష్ణ, ఆకురాతి నాగేంద్రం, రంగిశెట్టి పెద్దబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడులో భూమాయ

● ఫైళ్లు చక్కబెడుతున్నారు!

● రెవెన్యూ కార్యాలయాల్లో 9 గంటల వరకు గుట్టుగా భూముల ఆన్‌లైన్

పిడుగురాళ్ల, జూన్ 6: ఎన్నికల విధులకు వచ్చాం.. ఎట్లావున్నా మరో పదిరోజుల్లో బదిలీపై మరో జిల్లాకు వెళ్లాల్సిందే.. ఈలోగా నాలుగు రాళ్లు వెనకేసుకునే పనిలో రెవెన్యూ అధికారులు తలమునకలవుతున్నారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పట్టాదారు పాస్‌పుస్తకాలకు, ఆన్‌లైన్‌లో భూముల వివరాలు నమోదుకు డిమాండ్ వుండటంతో కొందరు అధికారులు గుట్టుగా భూముల ఆన్‌లైన్ వ్యవహారాలను చక్కబెట్టేస్తున్నారు. గురజాల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు ఫిబ్రవరిలో కొత్త తహసీల్దార్లను నియమించడం జరిగింది. ఎన్నికల ప్రక్రియకు వచ్చిన తహసీల్దార్లు ఈఎన్నికల తంతు ముగిసింది. మరో కొద్ది రోజుల్లో మరో జిల్లాకు బదిలీపై వెళ్తున్నాం కదా అంటూ భూముల ఆన్‌లైన్ నమోదు ఫైళ్లను చక్కబెడుతున్నారు. ఎలాగైనా బదిలీ తప్పదనుకుంటున్న కొందరు వీఆర్‌ఓలు, రెవెన్యూ అధికారులు ఇదే మంచి సమయమంటూ అందిన కాడికి దండుకుంటూ గురువారం రాత్రి 9గంటల వరకు కూడా కార్యాలయాల్లో ఉండి తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు. అంతేకాకుండా పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మండలాల తహసీల్దార్ల పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ నేతల పేరుతో అడ్డగోలుగా ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. కొద్దిరోజుల్లో నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటిదాకా చేసిన అక్రమాల, అడ్డగోలు వ్యవహారాలు బయటకు రాకుండా కీలక సమాచారం, ఆన్‌లైన్‌లో భూముల వివరాలను తొలగించే పనిలో కొందరు రెవెన్యూ అధికారులు తలమునకలవుతున్నట్లు తెలుస్తుంది.

కౌంటింగ్ అల్లర్ల కేసుల్లో

85 మంది అరెస్టు

● విజయోత్సవాల్లో పాల్గొంటే కేసులు..

● ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరిక



ఎస్పీ మాలికాగార్గ్

నరసరావుపేట, జూన్ 6: జిల్లాలో కౌంటింగ్ సందర్భంగా ఫలితాలు విడుదలైన తర్వాత నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేశామని, ఈకేసుల్లో ఇప్పటి వరకు 85 మందిని అరెస్టు చేశామని పల్నాడుజిల్లా ఎస్పీ మలికాగార్గ్ తెలిపారు. గురువారం ఆమె విలేకులతో మాట్లాడుతూ. విజయోత్సవ ర్యాలీలకు దూరంగా ఉండాలని, వీటిల్లో పాల్గొన్నవారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నా కొంత మంది గుంపులుగా చేరి గ్రామాల్లో విచ్చలవిడిగా ప్రభుత్వాస్తులను ధ్వంసం చేసి, ప్రత్యర్థుల ఇళ్లపై దాడులు చేసిన అన్ని ఘటనలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు 38 కేసులు నమోదు చేసి, 274 మందిని ముద్దాయిలుగా గుర్తించి, 85 మందిని అరెస్టు చేయడం జరిగింది. కొంత మంది పరారీలో ఉన్నవారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. గురువారం ఒక్క రోజే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 72మందిని అరెస్టు చేశామని వీరిని రిమాండ్‌కి పంపిస్తామన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆస్తులైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లపై దాడులు చేసిన, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేసిన, వ్యక్తిగత దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి జైళ్లకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు.



బలుసుపాడు వైసీపీ నేతల ఇంట్లో గొడ్డళ్ళు, కర్రలు

వైసీపీ నేత ఇంట్లో మారణాయుధాలు

● స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెదకూరపాడు, జూన్ 6 : పెదకూరపాడు ఎమ్మెల్యేగా భాష్యం ప్రవీణ్ గెలుపొందటంతో విజయోత్సవాన్ని జరుపుకున్న టీడీపీ వారిపై వైసీపీకి చెందిన వారు గొడవపడి ఇవే చివరి రోజులంటూ హెచ్చరించిన సంఘటన పల్నాడుజిల్లా పెదకూరపాడు మండలంలోని బలుసుపాడులో జరిగింది. బుధవారం రాత్రి గ్రామంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. కాగా వైసీపీకి చెందిన వారు గురువారం ఉదయం గ్రామ మాజీ సర్పంచ్ నల్లమేకల సూరమ్మ కోటేశ్వరరావు ఇంటి పైకి వెళ్ళి గొడవ పడి మీకు ఇవే చివరి రోజులు. మిమ్మల్ని లేకుండా చేస్తామని హెచ్చరించారని టీడీపీకి చెందిన వారు తెలిపారు. ఈవిషయమై పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు ప్రతి ఇంటిని సోదా చేస్తుండగా వైసీపీకి చెందిన నల్లమేకల జగన్‌మోహనరావు, దర్శిశ్రీధర్‌ల ఇళ్లలో దాచివుంచిన ఆరు గొడ్డళ్ళు, కత్తి, 18 కర్రలను స్వాధీనం చేసుకున్నామని పెదకూరపాడు ఎస్ఐ వీ.వెంకటరావు తెలిపారు. ఈ విషయంపై వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు వివరించారు.

కౌలు రైతు ఆత్మహత్య

వట్టిచెరుకూరు, జూన్6: అప్పుల భారంతో కౌలురైతు పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వింజనంపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గోరంట్ల కృష్ణారావు (70) తనకు ఉన్న సొంత భూమితో పాటు గత ఐదేళ్ల ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని ప్రత్తి, మిర్చి సాగు చేసుకుంటున్నారు. ఏటా అప్పుల తీరుతాయని కౌలు భూమి సాగు చేస్తున్నా మరింత అప్పులు పెరిగాయగాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయి కొంతకాలంగా మనోవేదనకు గురయ్యాడు. బుధవా రం ఇంటినుంచి వెళ్ళి మండలం పరిధి కొర్నెపాడు సమీపంలోని జగనన్నకాలనీలోని రోడ్డుపక్కన అపస్మారకస్థితిలో పడివున్నాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి జీజీహెచ్‌కి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

సీఎంవో ఆదేశాల కోసం ఎదురుచూపు

● సీఎం ప్రమాణ స్వీకార వేదిక ఖరారు కాగానే ఏర్పాట్లకు రెడీ

● తాడేపల్లి వెళ్లి ఉన్నతాధికారులను కలిసిన కలెక్టర్

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవ వేదికకి సంబంధించి ఏర్పాట్లు చేసేందుకు సీఎంవో ఆదేశాల కోసం జిల్లా యంత్రాంగం ఎదురు చూస్తున్నది. సీఎం కార్యాలయం నుంచి సమాచారం వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన సకల ఏర్పాట్లు చేసేందుకు అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. 2014లోనూ ఇదే రీతిన అప్పటి కలెక్టర్ సురేష్‌కుమార్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట భారీ ఏర్పాట్లు చేయించారు. ఈ దఫా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తారన్న సమాచారం ఉండటంతో అంతకంటే ఎక్కువగా ఏర్పాట్లు చేయడానికి సమాయత్తం అవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి తాడేపల్లి వెళ్లి సీఎంవోలో ఉన్నతాధికారులను కలిసినప్పటికీ ఇంకా వేదికపై స్పష్టత రాకపోవడంతో వెనక్కు వచ్చేశారు.

త్వరలో అన్ని శాఖల్లోకి కొత్త నీరు

● సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవంకాగానే బదిలీలు

● జిల్లా స్థాయి అధికారులకు తప్పనిసరిగా బదిలీలు

● ఎన్నికల కోసం ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు వెనక్కు

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గాడి తప్పిన ప్రభుత్వ శాఖలన్నింటిలోకి కొత్త నీరు రాబోతోన్నది. సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన కొద్ది రోజుల్లోనే బదిలీల ప్రక్రియ చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. తొలుత ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలు, ఆతర్వాత డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల్లో జిల్లా స్థాయి అధికారుల బదిలీలు చేపడతారు. ఈ నెల మూడు, నాలుగు వారంలలో బదిలీలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో విర్రవీగిన వారందరికి శంకరగిరి మాన్యాలు తప్పవన్న సంకేతాలు తెలుగుదేశం పార్టీ వర్గాల నుంచి వస్తోన్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో అధికారులు ఆ పార్టీకి అంట కాగారు. ఒక్క ఆ పార్టీ జెండాలు మాత్రమే బహిరంగంగా మోయలేదు తప్పా అన్ని చేసి పెట్టారు. వైసీపీ రంగులతో ప్రాంగణం, వేదికలని ముంచెత్తేవారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆ పార్టీ నాయకులు రాజకీయ ఆరోపణలు, విమర్శలు, ప్రసంగాలుచేస్తున్నా ముసిముసి నవ్వులు నవ్వుకొనేవారు. జిల్లా నీటియాజమాన్య సంస్థలో కీలక అధికారి ఒకరు వైసీపీ ప్రభుత్వంలో చలాయించుకొన్నారు. ఒక కీలక అధికారి అయితే పేదల ఇళ్లపట్టాల కోసం చేసిన భూసేకరణలో భారీగా దోచుకొన్నారు, వైసీపీ నేతలకు దోచిపెట్టారు. అలాంటి అధికారులంతా నేడు భిక్కుభిక్కు మంటున్నారు. తమపై ఎక్కడ విచారణలు మొదలౌతాయోనని మథనపడుతున్నారు. పేదల ఇళ్ల భూసేకరణ అనేది పెద్ద కుంభకోణం. దానిని విచారణ చేస్తే పెద్ద తలకాయలకే చుట్టుకుంటుంది. నివాసానికి పనికి రాని భూములను రూ. కోట్లు పెట్టి కొనుగోలుచేశారు. రకరకాల చట్టాలు తీసుకొచ్చి పెద్దలకు లబ్ధి చేకూర్చిపెట్టారు. అవన్నీ ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలుమెచ్చే సుపరిపాలన జరగాలంటే సమూలంగా ప్రక్షాళన తప్పదు.

టౌన్ హాల్లో డాక్టర్ కోడెల చిత్రపటం..

● రైల్వేబ్రిడ్జికి కోడెల పేరుతో బ్యానర్ ఏర్పాటు ..

నరసరావుపేటటౌన్,జూన్6: నరసరావుపేట పట్టణంలోని భువన చంద్రటౌన్ హాల్‌లో టీడీపీ శ్రేణులు, అభిమానులు గురువారం డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాన్ని ఏర్పాటుచేశారు. భువన చంద్రటౌన్ హాల్‌ను 2001లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రారంభించారు. ఆ



రైల్వే అండర్ బ్రిడ్జికి డాక్టర్ కోడెల పేరును ఏర్పాటుచేస్తున్న టీడీపీ శ్రేణులు



భువనచంద్ర టౌన్ హాల్లో కోడెల చిత్రపటాన్ని ఏర్పాటు చేసిన అభిమానులు

తర్వాత ప్రభుత్వం మారటంతో భువన చంద్ర టౌన్ హాల్‌లో ఉన్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాన్ని వైసీపీ ప్రభుత్వం తొలగించింది. ఇటీవల ఎన్నికలలో టీడీపీ విజయదుందుభి మోగించడంతో టీడీపీ శ్రేణులు, అభిమానులు డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. ఆదేవిధంగా అండర్ రైల్వేబ్రిడ్జికి డాక్టర్ కోడెల పేరును వైసీపీ ప్రభుత్వం తొలగించడంతో ఇప్పుడు టీడీపీ శ్రేణుల మరలా ఏర్పాటు చేశారు.

ప్రజలపై నిందలు వేయటం తగదు

● జగన్ ఓటమిని హుందాగా అంగీకరించు..

● చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రత్తిపాటి పుల్లారావు



చంద్రబాబుతో ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 6 : ఇప్పటికైనా ప్రజలపై నిందలు వేయటం, సాకులు మాని వైసీపీ, జగన్‌రెడ్డి ఓటమిని హుందాగా అంగీకరిస్తే మేలని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హితవు పలికారు. ప్రజల విశ్వాసాన్ని కొనసాగించటమంటే మోసాల పునాదుల పై ఎదిగి అబద్దపు ప్రచారాలతో నెట్టుకొచ్చేంత సులువు కాదన్న విషయాన్ని ఇప్పటికైనా వారు తెలుసుకుంటే మేలన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటుతో పాటు కేంద్రంలో కీలక శక్తిగా తెలుగుదేశం పార్టీ అవతరించిన నేపథ్యంలో గురువారం పార్టీ అధినేత చంద్రబాబును మర్యాద పూర్వకంగా ఉండవల్లి నివాసంలో ప్రత్తిపాటి కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట నుంచి 33 వేలకుపైగా ఆధిక్యంతో గెలుపొందిన ప్రత్తిపాటిని చంద్రబాబు అభినందించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీని ఎంత విచ్ఛిన్నం చేయాలని చూసినా కార్యకర్తలు, నాయకుల్లో చంద్రబాబు నింపిన స్ఫూర్తే తమను ఈ స్థాయిలో తలెత్తుకొని నిల్చొనేలా చేసిందన్నారు. చంద్రబాబువంటి అలుపెరగని పోరాట యోధుడిని అవమానించి అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసిన రోజే వారి గొయ్యి వారే తవ్వుకున్నారని, ఇంకా వారి తప్పు వారు గ్రహించక పోతే భారీగా మూల్యం చెల్లించు కుంటారని పుల్లారావు అన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారం కోసం

రాష్ట్రం ఎదురుచూస్తోంది..

● వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, జూన్ 6: నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు ప్రమాణ స్వీకారం కోసం యావత్ రాష్ట్రం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. యావత్‌దేశం ఆశ్చర్యకరమైన ఫలితాలను అందుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో పాటు, యువనేత నారా లోకేష్‌ను ఆంజనేయులు దంపతులు మర్యాద పూర్వకంగా గురువారం ఉండవల్లిలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలోకలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ప్రజలు ఈడ్చికొట్టినా ఇప్పటికైనా వైసీపీ నాయకులు, వారి అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోకుండా తిరిగి ప్రజలపై నిందలు వేయాలని చూడడం దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఐదేళ్ల జరిగిన దుర్మార్గాలన్నింటినీ ఆధారాలతో సహా బయటపెట్టి చట్టప్రకారమే వైసీపీ దొంగల ముఠా అందరిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దానికి సంబందించి ఇప్పటికే నారాలోకేష్ రెడ్ బుక్‌లో సిద్ధంగా ఉన్నాయన్నారు. తప్పు చేయని వాళ్లను ఇబ్బంది పెట్టేది లేదని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈనెల 12 తేదీన చంద్రబాబు ప్రమాణ స్వీకారం కోసం ప్రజలందరితో పాటు, తాము తెలుగు దేశంపార్టీ నాయకులు, శ్రేణులంతా ఎదురు చూస్తున్నామని ఆయన తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరి మృతి

మాచర్లటౌన్, జూన్ 6: మాచర్ల మండలం తాళ్లపల్లి పవర్‌గ్రిడ్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొని ఇద్దరు మృతిచెందగా బాలుడికి గాయాలైన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం నాగార్జున సాగర్ సమీపంలోని నెల్లికల్లు తండాకు చెందిన చావిటి బాలు(30) మాచర్ల పట్టణంలోని సిమెంట్ వరలు తయారు చేసే కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా స్వగ్రామమైన నెల్లికల్లు తండాకు వెళ్లాడు. తిరిగి గురువారం ద్విచక్ర వాహనంపై భార్య, కుమారుడు ఈశ్వర్‌తో మాచర్లకు వస్తుండగా మాచర్ల మండలం తాళ్లపల్లి పవర్‌గ్రిడ్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బాలుతో పాటు ఎదురు ద్విచక్ర వాహనంపై వస్తున్న మాచర్ల మండలం ఏడో మైలుకు చెందిన కొర్రా శ్రీనునాయక్ (50) మృతి చెందారు. కాగా బాలు కుమారుడు ఈశ్వర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాలను ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే పీఆర్కేపై మూడు కేసులు

రెంటచింతల, జూన్ 6: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై రెంటచింతల పోలీసుస్టేషన్‌లో మూడు కేసులు నమోదైనట్లు ఎస్ఐ ఆంజనేయులు చెప్పారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా పాలువాయిగేట్ గ్రామంలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం, టీడీపీ నేత నంబూరి శేషగిరిరావుపై హత్యాయత్నం,చెరుకూరి నాగశిరోమణిని దుర్భాషలాడిన ఘటనపై ఈ కేసులు నమోదైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవికి

నేడు లాలుపురం రాము రాజీనామా

గుంటూరు, జూన్ 6 (ఆంధ్యజ్యోతి) : జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తనపదవికి శుక్రవారం రాజీనామా చేయనున్నారు. వైసీపీ ప్రభుత్వం ఓటమి పాలై ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావటంతో వైసీపీకి చెందిన రాము ఈ నిర్ణయం తీసుకున్నారు. రూరల్‌మండలం లాల్‌పురం గ్రామానికి చెందిన రాము కాంగ్రెస్ హయాంలో గుంటూరు ఎంపీపీ, జడ్పీటీసీ పదవులను నిర్వహించారు. అప్పట్లో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైసీపీలో చేరారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటును ఆశించిన రాముకు అది దక్కకపోవటంతో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. తొలుత రెండేళ్లుగా ఆ పదవిలో ఆయన కొనసాగగా తిరిగి మళ్లీ ఆయనకే మరో రెండేళ్లపాటు చైర్మన్ పదవిని కట్టబెట్టారు. కాగా ఆయన హయాంలో బ్యాంక్ పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. పల్నాడు ప్రాంతంలో అనేక మందికి తప్పుడు రుణాలు ఇచ్చారని కూడా విమర్శలు వెల్లువెత్తాయి. ఇందులో వైసీపీకి అనుకూలంగా ఉండే బ్యాంక్ ఉద్యోగుల పాత్ర కూడా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఇప్పటివరకు వైసీపీ అధికారంలో ఉండటంతో ఆ ఆరోపణలను తొక్కిపట్టారు. అయితే అనూహ్యంగా భారీ మెజార్టీతో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావటంతో తన చైర్మన్‌పదవికి రాజీనామా చేసేందుకు రాము సిద్ధమయ్యారు. శుక్రవారం ఉద్యోగులకు, పాలకవర్గ సభ్యులకు విందు ఇచ్చి రాజీనామా చేసేందుకు రాము సన్నద్ధమయ్యారు.

వేద పాఠశాల ప్రవేశాలకు **దరఖాస్తుల ఆహ్వానం**

గుంటూరు(తూర్పు), జూన్6: స్థానిక మారుతినగర్‌లో శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఆర్షక ధర్మ సమితి' వేద స్మార్త సంస్కృత శాస్త్ర పాఠశాల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆలయ పాలక మండలి కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాలు పైబడి ఉపనయనం అయిన వారు, తెలుగు స్పష్టంగా చదవడం, వ్రాయడం వచ్చిన వారికి ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. వేద పాఠశాలలో ప్రవేశించిన వారికి ఉచిత భోజన, వసతి ఏర్పాటుతో పాటు విద్యార్థులను పరీక్షలకు పంపడం, సర్టిఫికెట్ ఇప్పించడం జరుగుతుందని వివరించారు. ప్రవేశాల గడుపు ఈ నెల 20తేదీతో ముగుస్తుందని, ఇతర వివరాలకు 0863 2354285, 98488 72729 అనే నెంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

విద్యాశాఖలో అవకతవకలపై విచారణ చేయాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల డిమాండ్

గుంటూరు(విద్య), జూన్ 6: గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో విద్యాకానుక కిట్ల కొనుగోళ్ళు, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వ్యవహారాలపై న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. గురుకువారం జిల్లా కోర్టు రోడ్డులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు అధ్యక్షత వహించారు. చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను అనేక, అవమానాలకు, హేళనలకు గురిచేసిందన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తే అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. ఉద్యమాలు కాదు కాళ్ళు పట్టుకునే నేర్పరితనం ఉండాలంటూ చులకనగా మాట్లాడి చివరికి ఉద్యోగ, ఉపాధ్యాయులు మా దృష్టిలో ఓటర్లే కాదని లెక్కలేనితనంతో మాట్లాడరన్నారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాల విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా ఉన్న జీఓ 117ను రద్దు చేయాలన్నారు. 3, 4, 5 తరగతులు విలీన ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లాకమిటీ సభ్యులు పి.నాగశివన్నారాయణ, జనార్ధనరావు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణమూర్తి, దాస్, శ్రీను, బాలరాజు, మరియరాజు, శివరామకృష్ణ, కిషోర్‌షా, ఎన్.శ్రీనివాస్, వివిధ మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు..



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



జూలకంటి బ్రహ్మారెడ్డిని అభినందిస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు

పార్టీ శ్రేణులు, ప్రజలదే ఈ విజయం

● మాచర్ల నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

కారంపూడి, జూన్ 6: అక్రమ కేసులు పెట్టి వేధించినా వైసీపీకి భయపడకుండా టీడీపీ విజయానికి కృషి చేశారని, మిమ్మల్ని ఎన్నటికీ మరువలేనని టీడీపీ నేతలను, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. భారీ మెజార్టీ సాధించిన బ్రహ్మారెడ్డిని గురువారం టీడీపీ కారంపూడి మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన నేతలు గుంటూరులో కలుసుకొని అభినందించారు. మండలంలో కనీవినీ ఎరుగని రీతిలో టీడీపీకి 6544 ఓట్ల మెజార్టీ లభించిందని లక్ష్మీనారాయణ వివరించారు. చింతపల్లిలో 1155, ఒప్పిచర్లలో 1677 భారీ మెజార్టీ వచ్చిదన్నారు. పార్టీకి పట్టుకొమ్మగావున్న వేపకంపల్లిలో వైసీపీ నేతలు అనేక విధాలుగా ఇబ్బంది పెట్టాలని చూసినా 700 మెజార్టీ టీడీపీకి లభించిందన్నారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కారంపూడి నుంచి ప్రారంభించారని, విజయోత్సవ ర్యాలీని కూడా కారంపూడి నుంచే ప్రారంభించాలని బ్రహ్మారెడ్డిని కోరారు. భారీ మెజార్టీ అందించిన ప్రజలకు బ్రహ్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మారెడ్డిని కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, వాణిజ్య విభాగం అధ్యక్షుడు పంగులూరి పుల్లయ్య తదితరులు ఉన్నారు.



మాచవరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

కూటమి శ్రేణుల విజయోత్సవ ర్యాలీలు

● మాచవరంలో భారీ కేక్ కటింగ్ ● ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి

మాచవరం, జూన్ 6: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఊహించని విధంగా విజయదుంధుభి మోగించిన తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విజయోత్సవ ర్యాలీలో భాగంగా మాచవరం మండలంలోని పలు గ్రామాలలో గురువారం భారీ ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రమైన మాచవరంతో పాటు వేమవరం, తదితర గ్రామాలలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి ఆనందోత్సవాల ర్యాలీలు నిర్వహించారు. మాచవరంలో, వేమవరంలో భారీ కేక్‌లు కట్‌చేసి ఎన్‌టీఆర్ విగ్రహాలకు భారీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పుర వీధులలో సంబరాలు అంబరాన్నంటాయి. టీడీపీ, జనసేన కార్యకర్తల ఆనందోత్సవాలకు అవధుల్లేకుండా పోయాయి. నియోజకవర్గంలో ముందెన్నడూ లేనివిధంగా 29,486 ఓట్ల అత్యధిక మెజారిటీ సాధించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎంపబ్యూ లావు శ్రీకృష్ణదేవరాయలుకు ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమాలలో టీడీపీ సీనియర్ నాయకులు యడ్లపల్లి రామారావు, కొల్లి కృష్ణమూర్తి, చల్లాపల్లి నరసింహారావు, పుసులూరి రామయ్య, సయ్యద్ అల్లాభక్షు, శ్రీనివాసరావు, కేకే చిల్లీస్ అధినేత నరసింహారావు, చింతా సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి: మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ సాగించిన అరాచకానికి ప్రజలు బుద్ధి చెబుతూ నిశ్శబ్ధంగా టీడీపీకి ఓటు వేశారని, ప్రజల నిర్ణయం నియోజకవర్గ అభివృద్ధికి దోహద పడుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జానిలు అన్నారు. వైసీపీ రౌడీ మూక ఎన్నికల మరుసటి రోజున టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేశారన్నారు. బెయిల్ రావడంతో బుధవారం బయటకు వచ్చినవారు బైకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, పట్టణ మాజీ అధ్యక్షుడు షేక్ జానీబాషా, ఆపరేటర్ కొండా, షేక్ మోదీన్‌షా, మహంకాళి శ్రీను, షేక్ నన్నేసా, రబ్బాని బాజీ, తుపాకుల చిన రత్తయ్య, నరసింహారావు, నాగవరపు రాముడు, పేరయ్య, బాలునాయక్, ఆర్యవైశ్య సంఘ నేతలు పాల్గొన్నారు.



రాజుపాలెం టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నేతలు

రాక్షస పాలన నుంచి విముక్తి

రాజుపాలెం,జూన్6: రాష్ట్రంలో రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిందని తెలుగుదేశం, జనసేన పార్టీల నేతలు అన్నారు. గురువారం మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను మాజీ సర్పంచ్ పులిబండ్ల సాంబశివరావు, లంకా వీరయ్య, సభినాల వలిరాజులు, చొక్కా శ్రీను కట్ చేశారు. వారు మాట్లాడుతూ ఎవరూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా అందరం కలిసి కట్టుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు జంగం రాజా, చొక్కా గాలయ్య, జెట్టి కోటేశ్వరరావు, వాసా వెంకటేశ్వర్లు, గంగారావు, బ్రహ్మయ్య, దుడుకు రామారావు, జనసేన పార్టీ నేతలు చెవుల ఆంజనేయులు, కేదారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్

దాచేపల్లి, జూన్6: దాచేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నగర పంచాయతీలోని నడికూడి రైల్వేస్టేషన్ వద్ద రైల్వే హాస్పటల్‌లో ఉచితంగా క్షయ, ఉబ్బసం, టీబీ, ఆయాసం రాకుండా 60 సంవత్సరాలు పైబడిన పురుషులకు, మహిళలకు వైద్యులు బీసీజీ వ్యాక్సిన్‌ను అందజేశారు.

మొక్కల పెంపకంతో

పర్యావరణ రక్షణ

దాచేపల్లి, జూన్ 6: మొక్కలు పెంపకం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఆంధ్రా సిమెంట్స్ లిమిటెడ్ ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ సుబ్బారావు తెలిపారు. గురువారం దాచేపల్లి మండలం గామాలపాడు సమీపంలోని ఆంధ్రా సిమెంటు ఫ్యాక్టరీ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవాళి మనుగడ కోసం, భూమి ఎడారీక రణను నిరోధించడం కోసం మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మొక్కలు నాటడం ఓ ఉద్యమంలా కొనసాగాలన్నారు. ఉద్యోగులందరూ తాము పని చేసే చోట, నివాసం వుండేచోట మొక్కలను నాటాలని సూచించారు. ఈ సందర్భంగా 2 వేల మొక్కలను నాటించారు. క్విజ్, వ్యాసరచన, పెయింటింగ్, స్లోగన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాలలో నరేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి రౌండ్‌లో కూటమిదే గెలుపు..

● గత ఎన్నికల్లో వైసీపీ ఆధిక్యతకు ఈ దఫా గండి

పిడుగురాళ్ల, జూన్ 6: గత నెల 13వ తేదీన జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రతి రౌండ్‌లోనూ టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు భారీ ఆధిక్యతను గురజాల ఓటర్లు కట్టబెట్టారు. మొత్తం 23 రౌండ్లు వుండగా మూడు రౌండ్లలో వైసీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డికి కొంత ఆధిక్యత కనిపించగా మిగిలిన అన్ని రౌండ్లలోనూ యరపతినేని శ్రీనివాసరావుకు భారీ ఆధిక్యత లభిం చింది. మొత్తం 1,28,201 ఓట్లు యరపతినేని శ్రీనివాసరావుకు, 98,715 ఓట్లు కాసు మహేష్‌రెడ్డికి లభించాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఏ అభ్యర్థికి ఇంతటి భారీ మెజారిటీ లేదనే చెప్పవచ్చు.

రౌండ్ నంబరు	టీడీపీ ఓట్లు	వైసీపీ ఓట్లు	రౌండ్ నంబరు	టీడీపీ ఓట్లు	వైసీపీ ఓట్లు
1	5927	4335	13	6164	4950
2	7169	4287	14	5586	5334
3	5922	4371	15	6013	4553
4	6243	4588	16	4573	5348
5	5666	5430	17	4922	5087
6	5340	3960	18	5919	4382
7	5185	3355	19	6936	3940
8	5628	4765	20	6449	3933
9	6420	3866	21	5673	3811
10	5067	5217	22	4339	3047
11	5709	5189	23	1165	249
12	4943	3986			

మండలాల వారీగా ఆధిక్యత :

గురజాల నియోజకవర్గంలో 2019 ఎన్నికలలో, 2024 ఎన్నికలలో టీడీపీ, వైసీపీ అభ్యర్థులకు లభించిన మెజారిటీ.

		2019లో వైసీపీ మెజార్టీ	2024లో టీడీపీ మెజార్టీ
పిడుగురాళ్ల రూరల్‌లో	-	6958	1210
పిడుగురాళ్ల పట్టణంలో	-	7675	9860
మాచవరం మండలంలో	-	2760	3445
దాచేపల్లి మండలంలో	-	5841	8075
గురజాల మండలంలో	-	4986	6475



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసిన గురజాల నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

నారా లోకేశ్‌ను కలిసిన యరపతినేని

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను గురువారం గురజాల నియోజకవర్గ నూతన శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు.

యరపతినేనిని కలిసిన పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్

గురజాల శాసనసభ్యునిగా 4వ సారి ఎన్నికైన యరపతినేని శ్రీనివాసరావును నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు గురువారం గుంటూరులోని యరపతినేని కార్యాలయంలో కలిశారు. పిడుగురాళ్ల వైసిపికి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు యరపతినేనిని గుంటూరులో కలిసి సత్కరించారు.

వైసీపీ కౌన్సిలర్లదీ అదేబాట..

మంగళవారం శాసన సభ ఫలితాలు వెలువడిన వెంటనే బుధ, గురువారాలలో పిడుగురాళ్లకు చెందిన పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును గుంటూరులో కలవడం చర్చనీయాంశంగా మారింది. ఇక పిడుగురాళ్లలోని మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు కూడా అదేబాటన యరపతినేనిని కలిసి మీవెంటే మేమనే రీతిలో నడవనున్నట్లు తెలుస్తుంది.



యరపతినేనిని కలిసిన మునిసిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

చంద్రబాబుని కలిసిన భాష్యం ప్రవీణ్



చంద్రబాబుతో భాష్యం ప్రవీణ్



భాష్యం ప్రవీణ్‌కు బొకే అందిస్తున్న సైదారావు తదితరులు

పెదకూరపాడు, జూన్ 6 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును పెదకూరపాడు నూతన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురువారం ఉండవల్లిలోని ఆయననివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎన్నికల సరళి, పరిస్థితులపై ప్రవీణ్ చంద్రబాబుకి వివరించారు. ముందుగా ప్రవీణ్ చంద్రబుబుని శాలువా, బొకేలతో ఘనంగా సత్కరించారు.

ప్రవీణ్‌కు అభినందనలు..

పెదకూరపాడు ఎమ్మెల్యేగా విజయం సాధించిన భాష్యం ప్రవీణ్‌ను శరవణ్ అగ్రిటెక్ కోల్డ్ స్టోరేజ్ ఎండీ ఒట్టికూటి సైదారావు గురువారం మర్యాదపూర్వకంగా కలసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరిం చారు. ప్రవీణ్‌ను కలసివారిలో ఎన్ఆర్ఐ వట్టికూటి రామ్ సిద్ధార్థ నూతలపాటి అజయ్, జాస్తి వెంకయ్య చౌదరి, యంపరాల సురేష్ బాబు ఉన్నారు. టీడీపీ విజయం సాధించటంపై మండలం లోని లగడపాడు పోలేరమ్మ తల్లి ఆయలంలో సైదారావు పూస్మాండబలి పూజ చేశారు.

చెరుకుంపాలెంలో విజయోత్సవం

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో టీడీపీనేత మన్నెంభద్రయ్య ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవ కేక్‌ను కట్‌చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పోట్ల శ్రీనివాసరావు, మన్నెం లక్ష్మి, గోపి, పలువురు పాల్గొన్నారు. సాయంత్రం చెరుకుంపాలెంలోని ఆంజనేయుని విగ్రహంసెంటర్ నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్రామ పార్టీ నాయకుడు పోట్ల శ్రీనివాసరావును పూలమాలలతోను, శాలువాలతో సత్కరించారు. మండలంలోని పలు గ్రామాల్లోనూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, మహిళలు ఆయా ర్యాలీలలో పాల్గొన్నారు.



చెరుకుంపాలెంలో టీడీపీ విజయోత్సవ కేక్ కట్ చేస్తున్న మహిళలు

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

క్రోసూరు, జూన్6: మండలంలోని పెరికపాడులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, సబ్ యూనిట్ మలేరియా అధికారి షేక్ బేగ్‌లు మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల వ్యాప్తి ద్వారా సోకుతుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవటంతో పాటు మురుగు నీరు నిల్వ ఉండ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ తెరలు వాడటంతో పాటు కూలర్లలోను, ఇంటి పరిసరాల్లోను నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా వ్యాధి లక్షణాలు కనపడగానే స్థానిక ఆస్పత్రిలోని వైద్యసిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి షేక్ అమీర్, ఆరోగ్య కార్యకర్త మల్లేశ్వరి, అంగన్‌వాడీటీచర్ మాధవి పాల్గొన్నారు.

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ రాంబాబు, సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి మొగల్ సుభానీ, పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి పీ వెంకటరావు, హెల్త్ ఎడ్యుకేటర్ కే పార్వతి, ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు

పేదల కోసం పోరాడిన చంద్ర

దాచేపల్లి, జూన్ 6: పేదల అభ్యున్నతికి అలుపులేని పోరాటాన్ని చేసిన కమ్యూనిస్టు నేత చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ నేతలు అన్నారు. గురువారం నారాయణపురంలోని సీపీఐ కార్యాలయం వద్ద చంద్ర రాజేశ్వరరావు, ప్రత్తిపాటి రోశయ్య జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేయటం మాని పేదల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. పేదల పోరాటాలకు సీపీఐ అన్నివిధాలా అండగా ఉంటుందని, ముందుడి నడిపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వేముల వెంకటరెడ్డి, కొమెర వెంకటరావు, తమ్మిశెట్టి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిధులు స్వాహా ..

● సిబ్బంది అవసరాలకు ఖర్చు పెట్టాల్సిన నిధులు జేబుల్లోకి

పిడుగురాళ్ల, జూన్ 6: సాధారణ ఎన్నికల రోజున ప్రతి పోలింగ్ కేంద్రంలో వసతుల ఏర్పాటుకు కేంద్ర ఎన్నికల సంఘం నిధులు విడుదల చేసింది. ప్రతి పోలింగ్ కేంద్రానికి రూ.8 వేలను చొప్పున కేటాయించింది. ఎన్నికల రోజున పోలింగ్ సిబ్బందికి భోజనం, అల్పాహారం, టీ, మంచినీటితో పాటు ఓటర్లకు తాగునీరు, టెంటు ఏర్పాటుకు వినియోగించమని ఆదేశించింది. అయితే ఆ రూ.8 వేలు పోలింగ్ కేంద్రం నిర్వహణ చూస్తున్న అధికారులకు ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున పందేరం చేసి కొందరు రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో కొందరు పోలింగ్ కేంద్రం విధుల్లో వున్న వీఆర్వోలు ఆయా గ్రామ, పట్టణ పార్టీలనేతల వద్ద నుంచి మరికొంత వసూలు చేసి ఎన్నికల రోజున సిబ్బందికి భోజన సదుపాయాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన నిధులను పంచుకోవడంపై పిడుగురాళ్లలోని పలువురు వీఆర్వోలు రెవెన్యూ అధికారులను ప్రశ్నించినప్పటికీ సమాధానం రాలేదు. ఎన్నికల విధుల్లో సిబ్బంది అవసరాలు, సదుపాయాల ఏర్పాట్లుకు ఖర్చు చేయాల్సిన నిధులను కొందరు అధికారులు జేబుల్లో వేసుకోవడంతో తమ జేబులకు చిల్లులు పడ్డాయంటూ కొందరు అధికారులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ పరిస్థితి పిడుగురాళ్ల మండలంతో పాటు అన్ని మండలాలల్లోనూ దాపురించింది.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దాచేపల్లి, జూన్ 6: దాచేపల్లి మండలం పొందుగల రెవెన్యూ శివారు శ్రీనివాసపురం గ్రామ పంట పొలాల్లో గుర్తుతెలియని పురుషుడి అస్తిపంజరాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. గురువారం దాచేపల్లి ఎస్ఐ సంధ్యారాణి మాట్లాడుతూ.. శ్రీనివాసపురం గ్రామానికి చివరగా ఉన్న బీడు భూముల్లో ఓ వ్యక్తి అస్తిపంజరం ఉండటాన్ని పశువుల కాపరులు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. ఘటన ప్రాంతంలో ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

వర్షం.. హర్షం

● తొలకరి వర్షంతో పులకించిన పల్లెలు
● మాచర్లలో 72.4 మి.మీ.ల వర్షపాతం నమోదు

మాచర్ల రూరల్, జూన్ 6: మాచర్ల నియోజకవర్గంలో కురిసిన తొలకరి వర్షం భారీగా కురవడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. నియోజకవర్గంలో వారం వ్యవధిలో 60 మి.మీ.లు ఒకసారి, 72 మి.మీ.లు మరోసారి కురవడంతో ఈ వర్షాలు రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారాయి. అడవులు పచ్చపడడంతో పశుగ్రాసం కొరత తీరనుంది. భూగర్భజలాలు కూడా పెరిగే అవకాశం మెండుగా ఉంది. తొలకరిలోనే మంచి వర్షాలు కురవడం శుభసూచికంగా రైతులు పేర్కొంటున్నారు. జూన్ నెలలోనే మంచి వర్షం కురవడం రైతుల్లో చెప్పలేనంత ఆనందం నెలకొంది. పొలాలు చదును చేసుకోవడం, దుక్కిదున్నడం, విత్తనాలు విత్తుకోవడం వంటి పనుల్లో రైతులు, రైతు కూలీలు నిమగ్నమయ్యారు. మే, జూన్ నెలల్లో మంచి వర్షం కురవడం అదృష్టంగా ప్రజలు భావిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి భారీగా వర్షం కురిసింది. రైతులతోపాటు ప్రజలు కూడా వర్షం రాకతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటిదాకా తీవ్ర ఎండలతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఇప్పటి దాకా మూలనపడ్డ బోర్లు కూడా తిరిగి వినియోగంలోకి రానున్నాయి. మాచర్లలో 72.4 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే దుర్గి మండలంలో 15.8 మి.మీ.లు, వెల్దుర్తిలో 45.2 మి.మీలు, రెంటచింతల మండలంలో 60.2 మి.మీ.ల వర్షం కురిసింది.



విత్తనాలు విత్తుతున్న రైతులు, వ్యవసాయ కూలీలు



కన్నాను సన్మానించిన సత్తెనపల్లి పట్టణ దళిత నేతలు

కన్నాకు ఘన సత్కారం

సత్తెనపల్లి, జూన్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజక వర్గం నుంచి విజయం సాధించిన కన్నా లక్ష్మీనారాయణను బుధవారం గుంటూరులోని ఆయన నివాసంలో సత్తెనపల్లికి చెందిన దళిత నేతలు కలసి అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. కన్నా నాయకత్వంలో సత్తెనపల్లి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గుజ్జర్లపూడి స్టాలిన్, కత్తి సాగర్, గుజ్జర్లపూడి జాషువా, ఆదం, బలిజేపల్లి సురేష్, పలువురు టీడీపీ ఎస్సీ సెల్ నేతలు పాల్గొన్నారు.



కన్నాను సత్కరిస్తున్న కూటమి నేతలు , శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ సింగరాజు సాయికృష్ణ

నకరికల్లు, : మండలంలోని కుంకలగుంట గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, వీర మహిళలు 30 వాహనాల్లో గుంటూరుకు వెళ్ళి కన్నా లక్ష్మీనారాయణను ఆయన స్వగృహంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, జవ్వాజి మల్లికార్జునరావు, ఆవుల సుబ్బయ్య, తాంద్ర వెంగళరావు, కనుమూరి శ్రీనివాసరావు, కొల్లి సైదారావు, రుసుం కోటయ్య, ఆవుల శ్రీనివాసరావు, చేజర్ల వెంకటేశ్వర్లు, గోళ్ళపూడి మాణిక్యారావు, అయ్యప్ప, గోపు శ్రీనివాసరావు, మహాలక్ష్మమ్మ, వెంకయ్య పాల్గొన్నారు.

వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు

సత్తెనపల్లి, జూన్ 6 : ఇటీవల వెలువడిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైసీపీకి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి అన్నారు. కూటమి రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు సాధించటంతో బుధవారం ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ఆయన మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా సాగిన జగన్ దుర్మార్గపు పాలనకు అంతంపలికేలా ప్రజలు భారీ మెజార్టీలతో టీడీపీ కూటమి అభ్యర్థులకు పట్టం కట్టారన్నారు. ఎన్డీఏ కూటమి విజయాన్ని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో అవినీతి పరుడైన అంబటి రాంబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. నారా చంద్రబాబునాయుడు సీఎంగా, కన్నా లక్ష్మీనారాయణ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖరారైందన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మాచర్ల నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబులు బుధవారం రాత్రి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు.
- మాచర్లటౌన్,

టీడీపీ ఎస్సీ సెల్ నేత విజయ్‌పాల్ మృతి

● పార్టీ నాయకుల సంతాపం

క్రోసూరు, జూన్ 6 : పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిలకా విజయ్‌పాల్ (55) గురువారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన పక్షవాత సంబంధమైన వ్యాధితో బాధపడుతున్నట్టు బంధువులు తెలిపారు. మరో టీడీపీ నేత గోగిశెట్టి వెంకయ్య కూడా గుండె పోటుతో మరణించినట్టు బంధువులు తెలియ జేశారు. వీరిరువురి మృతికి పలువురు టీడీపీ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌లు మృతుల కుటుంబ సభ్యులకు ఫోన్‌లు చేసి పరామర్శించారు. చిలకా విజయ్‌పాల్ నియోజక వర్గంలో ఎమ్మార్పీఎస్ నాయకుడిగా కూడా గుర్తింపు పొందారు. పలువురు టీడీపీ నాయకులు మృతి చెందిన వారి గృహాలకు వెళ్ళి మృతదేహాలకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, టీడీపీ నాయకులు దుద్దుల యోహాన్, మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, అనుమాల పూర్ణ, మల్లాల రామాంజనేయులు, షేక్ హసాన్, దారెడ్ల సీతారెడ్డి, షేక్ మస్తాన్, కరిముల్లా, ముస్తఫా, బండారు మైసూర్ బాబు, మన్నెం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకిచ్చిన హామీలను నెరవేర్చాలి..

రెంటచింతల,జూన్ 6 : రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో కూటమి గన విజయం సాధించి త్వరలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేపట్టనున్న చంద్రబాబునాయుడు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గురజాల తాలుకా ఏపీఎన్‌జీవో అసోసియేట్ అధ్యక్షులు కందిమళ్ల నాగరాజు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీపీఎస్‌పై ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవాలని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచి ప్రతి నెలా 1న అందేలా చూడాలన్నారు. ఉద్యోగుల మనస్సు చూరగొనేలా పాలన ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

భాష్యం ప్రవీణ్ కు అభినందనలు

బెల్లంకొండ, జూన్ 6 : పెదకూరపాడు నూతన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం గురువారం గుంటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బెల్లంకొండ గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని ఎమ్మెల్యేని సర్పంచ్ కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తానని హామీ నిచ్చారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, గుంజా శివ, ఓర్సు రాంబాబు తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు .. బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం, చంద్రాజుపాలెం గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సవాలు నిర్వహించారు. నాగిరెడ్డిపాలెం గ్రామంలో మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ విజయం పట్ల గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా చంద్రాజుపాలెం గ్రామంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిక్కిరెడ్డి పిచ్చిరెడ్డి, కొమ్మిశెట్టి సత్యనారాయణ, చావలి రామకృష్ణ, ఓర్సు రాంబాబు, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, వెంకయ్య పాల్గొన్నారు.

జనసేన నాయకులు పాదయాత్ర

అచ్చంపేట, జూన్ 6 : పిఠాపురంలో పవన్ కల్యాణ్ భారీగా గెలవడంతో సత్తెనపల్లి మండలం కందువారిపాలెం జనసేన కార్యకర్తలు 40 మంది ఎన్టీఆర్‌జిల్లా వేదాద్రిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు గురువారం ఉదయం పాదయాత్రను చేపట్టారు. ఈ పాదయాత్రలో బిట్రగుంట కృష్ణారావు, సవరాల పెద్ద బాజీ, పగడాల లక్ష్మీనారాయణ, యలమందయ్య, పసుపులేటి మల్లారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



డాక్టర్ చదలవాడను మర్యాద పూర్వకంగా కలిసిన వైసీపీ డాక్టర్స్ సెల్ వైద్యులు

డాక్టర్ అరవిందబాబుకు వైసీపీ డాక్టర్స్ సెల్ అభినందనలు



డాక్టర్ అరవిందబాబును అభినందిస్తున్న మాజీ ఎంపీపీ కొమ్మాలపాటి ప్రభాకర్, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు

నరసరావుపేట టౌన్, జూన్ 6: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో నరసరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ చదలవాడ అరవిందబాబును గురువారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణానికి చెందిన ఇండియన్ అసోసియేషన్ సభ్యులు, వైసీపీ డాక్టర్స్ సెల్ వైద్య బృందం డాక్టర్ చదలవాడ అరవిందబాబును ప్రకాష్‌నగర్‌లోని గృహంలో కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ దత్తు, డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పాలూరి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, డాక్టర్ పేరం రాజనందరెడ్డి, డాక్టర్ గడ్డం శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ పీ రామచంద్రారెడ్డి, డాక్టర్ మేకల చంద్రకిరన్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ వసంతరాయ, డాక్టర్ రాంప్రసాద్, లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎంపీపీ కొమ్మాలపాటి ప్రభాకర్ డాక్టర్ చదలవాడ అరవిందబాబును శాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

కోర్టులో డాక్టర్ చదలవాడకు ఊరట

నరసరావుపేట లీగల్, జూన్ 6: గత నెల 13న ఎన్నికల సందర్భంగా పట్టణంలో చోటు చేసుకుంటున్న హింసాత్మక ఘటనలకు సంబంధించి టీడీపీ వర్గీయులపై నమోదైన రెండు కేసుల్లో ముందస్తు బెయిల్, రెగ్యులర్ బెయిల్ మొత్తం 30మందికి లభించాయి. ఎన్నికల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటి ఎదుట జరిగిన ఘటన, మునిసిపల్ హైస్కూల్ ఎదుట జరిగిన ఘటనల్లో టీడీపీ వర్గీయులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసుల్లో డాక్టర్ చదలవాడ అరవిందబాబు, న్యాయవాది దేసిరెడ్డి చిన్నపరెడ్డి, వేల్పుల సింహాద్రి యాదవ్‌లకు ముందస్తు బెయిల్ లభించింది. మరో 27 మందికి రెగ్యులర్ బెయిల్ మంజూరు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

కారు దహనం చేసిన వ్యక్తుల అరెస్టు

నరసరావుపేట లీగల్, జూన్ 6: పట్టణంలోని ప్రకాష్ నగర్‌లోని సతీష్ రోడ్డులో ఈ నెల 4న చోటు చేసుకున్న కారు దహనం కేసులో నిందితులను అరెస్టు చేసినట్టు గురువారం మొదటి పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన పీ సాయి భూషణ్ కారు ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడని, అతని వద్ద నుంచి పట్టణానికి చెందిన ఫణిదం రోసిబాబు అలియాస్ బోసు రెండు నెలల క్రితం కారును అద్దెకు తీసుకున్నాడని పేర్కొన్నారు. ఈ సమయంలో కారు అద్దం పగిలిందని, బాగు చేయించి ఇవ్వాలని ట్రావెల్స్ నిర్వాహకుడు భూషణం నిందితుడు బోసును కోరాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న భూషణ్ తన ఇంటి వద్ద కారును నిలపగా నిందితుడు బోసు, మరో ఇరువురు మిత్రుడితో కలసి కారును దహనం చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం రోసిబాబు, వినయ తుల్లాలను అరెస్టు చేసినట్టు తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని వారు తెలిపారు.

22న నరసరావుపేట మండల సాధారణ సర్వసభ్య సమావేశం

నరసరావుపేట రూరల్, మే 6: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన శనివారం ఉదయం 11 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవికాంత్ తెలిపారు. నరసరావుపేట మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు శాఖా పరమైన అభివృద్ధి పనులపై పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సాగర్ కుడి కాలవకు మరమ్మతులు చేపట్టాలి

● రైతు సంఘం నాయకుడు రాము

వినుకొండటౌన్, జూన్ 6: నాగార్జున కుడికాలువలో పూడికలను తొలగించి, షట్టర్లు లేనిచోట, వెంటనే షట్టర్లు నిర్మించి చివరి భూములకు సాగునీరు అందేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. స్థానిక శివయ్య భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాము మాట్లాడుతూ నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో లక్షలాది ఎకరాల రైతులు కాలవపై ఆధారపడి పంటలు పండిస్తున్నారని, నీటి విడుదల సమయంలో కాలవపై షటర్లు లేక నీరంతా వృథాగా పోతోందని, చివరి భూములకు నీరు చేరక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగునీరు అందే పరిస్థితి లేకపోవడంతో భూములు బీడు భూములుగా మిగిలి రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కాలవకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని, ఇప్పటికైనా నూతనంగా ఏర్పడే ప్రభుత్వం కాలవలకు మరమ్మతులు చేపట్టి కాలవపై ఆధారపడిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు చీరాల ఆంజయ్య, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, పోట్లూరి వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

మలేరియాపై అవగాహన

నరసరావుపేట లీగల్, జూన్ 6: పట్టణంలోని డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో గురువారం సిబ్బందికి మలేరియా నివారణపై అవగాహన, మానవహారం ప్రదర్శన నిర్వహించారు. పల్నాడు జిల్లాలోని అన్ని ప్రాథమిక, పట్టణ ప్రాథమిక, ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్‌లు, మలేరియా కార్యాలయ సిబ్బంది తదితరులకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బీ రవి మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లందరూ అన్ని రకాలైన రక్త పరీక్షలు చేసి జూన్ మాసం నుంచి అంటువ్యాధుల విజృంభణను నివారించటానికి కృషి చేయాలన్నారు. వ్యాధులు రాకుండా సత్వరమే చికిత్స చేసినట్లయితే ప్రజలకు ఎంతో మేలు చేసిన వారవుతారన్నారు. డెంగీ లాంటి వ్యాధుల నిర్ధారణలో పరీక్షలు త్వరగాచేసి వ్యాధిగ్రస్తులకు ద్రవాలు ఎక్కువగా ఇవ్వటం, విశ్రాంతి తీసుకోవటం లాంటివి చేసినట్లయితే వ్యాధి తీవ్రతకు గురికాకుండా కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో రవీంద్ర రత్నాకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఫీల్డ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం

- ● ఉపాధి కోల్పోయి పేదలు విలవిల
- ● 144 సెక్షన్ అంటే షాపులు మూసివేయాలా ?
- ● ఇదెక్కడి పోలీసు రాజ్యాంగం అంటూ బాధితుల ఆగ్రహం
- ● 10 వరకు 144 సెక్షన్ జిల్లాలో కొనసాగింపు



నరసరావుపేటలో మూతపడ్డ దుకాణాలు

నరసరావుపేట, జూన్ 6: పోలింగ్, తదుపరి జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో కలెక్టర్ నిరవధికంగా జిల్లా అంతటా 144 సెక్షన్ విధించారు. ఎన్నికల కోడ్‌తో పాటు 144 సెక్షన్ గురువారం ముగిసింది. అయితే ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో పలుచోట్ల ఘర్షణలు జరిగాయి. దీంతో ఈ నెల 10 వరకు 144 సెక్షన్ పొడిగించినట్టు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 144 సెక్షన్‌కు బదులు పోలీసు అప్రకటిత కర్ఫ్యూను అమలు చేస్తున్నారు. దుకాణాలను బలవంతంగా మూయిస్తున్నారు. మరో నాలుగు రోజులు దుకాణాలు మూయించనున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు. 144 సెక్షన్ అంటే షాపులు మూయించాలని లేదు. అయితే ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించేలా పోలీసులు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల అత్యుత్సాహం వలన ఉపాధికి గండి పడి పేదలు విలవిలాడుతున్నారు. మానవతా కోణంలో కూడా పోలీసులు వ్యవహరించడంలేదన్న వాదన వినిపిస్తోంది. శాంతి భద్రతలను కాపాడాలంటే దుకాణాల మూసివేత ఒక్కటే మార్గం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 1నుంచి దుకాణాలను మూసివేయిస్తున్నారు. చిరు వ్యాపారులు, చేతి వృత్తులవారు, రోజు వారి కూలీ పనులకు వెళ్లే కార్మికులు ఇలా జిల్లాలో వేలాది మంది ఉపాధి కోల్పోతున్నారు. పూట గడవని పరిస్థితిని వందలాది కుటుంబాలు ఎదర్కొంటున్నాయి. అయినా తన పంతం నెగ్గాలన్న రీతిలో బలవంతంగా దుకాణాలను పోలీసులు మూయివేయిస్తూ పేదల పొట్టకొడుతున్నారన్న ఆవేదన ఆయా వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. 25 రోజుల వ్యవధిలో దాదాపు 15 రోజులుకు పైగా వ్యాపారాలు లేక వ్యాపారులు ఇక్కట్లు పడుతున్నారు. ఎప్పటికి దుకాణాలు తెరవనిస్తారో తెలియక అల్లాడుతున్నారు. అంక్షల విషయంలో పోలీసులు పునరాలోచన చేయాలని తమకు ఉపాధి కల్పించాలని పేదలు కోరుతున్నారు.



మాజీ మంత్రిని ప్రత్తిపాటి కలసిన పోలీసు అధికారులు, ప్రత్తిపాటిని ఆశీర్వదిస్తున్న క్రిష్టాఫర్, ప్రత్తిపాటి ఇంటి వద్ద టీడీపీ అభిమానుల కోలాహలం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా

మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 6: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని మాజీమంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యుడిగా గెలిచిన ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తనను కలిసేందుకు వచ్చిన అభిమానులతో ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా వైసీపీ నాయకులు ఏంచేశారో రాష్ట్రం మొత్తం చూసిందని, దీనికి ప్రతిఫలంగానే ఎన్నికల్లో ఓటమి మొదటి ప్రతిఫలమని, మంచికి మంచి, చెడుకు చెడే ఎదురు వస్తాయని వైసీపీ నేతలంతా గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్థానిక సమస్యలను పరిష్కరించి నియోజక వర్గాన్ని అభివృద్ధి పథకంలో నడిపించేందుకు కృషి చేస్తానని, రానున్న ఐదు సంవత్సరాల్లో అమరావతి, పోలవరం పూర్తితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, అభివృద్ధితో పాటు రాష్ట్రమంతా జల సవ్వడులతో సుఖ శాంతులతో వెలసిల్లే రోజులు త్వరలో చూడబోతున్నామన్నారు. చంద్రబాబు నాయకత్వం, దార్శనికతలే ఆ దిశగా నవ్యాంధ్ర నవశకంలోకి నడిపించ బోతున్నాయని ప్రత్తిపాటి విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రత్తిపాటి ఇంట కోలాహలం

చిలకలూరిపేట, జూన్ 6: పట్టణంలోని పండరీపురంలో ఉన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఇంటి వద్ద గురువారం సందడి వాతావరణం నెలకుంది. వివిధ గ్రామాల నుంచి, పట్టణంలోని పలు వార్డుల నుంచి తరలి వచ్చిన నాయకులతో ఆయన ఇంటి వద్ద కోలాహలంగా ఉంది. వారు ప్రత్తిపాట పుల్లారావు బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి వెళ్లారు. యడ్లపాడు మండలం కొండవీడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తరలివచ్చి కొండవీటి రాజుల పౌరుషానికి ప్రతీకంగా ఉండే పొడవైన కత్తిని ఆయనకు బహుమతిగా అందజేశారు. దీనికి తోడు పలు గ్రామాల్లో టీడీపీ గెలుపు పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ విందు భోజనాలు పెట్టుకుంటున్నారు. పాలెం గ్రామాలైన నాగభైరువారిపాలెంలో గ్రామ యువత ఆధ్వర్యంలో గ్రామస్తులందరికీ విందు భోజనాలు పెట్టారు. కాగా ఈవూరివారిపాలెం గ్రామంలో ప్రత్తిపాటికి ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. ఆ గ్రామంలో టీడీపీకి 806 ఓట్లు, వైసీపీకి 13 ఓట్లు లభించాయి. టీడీపీకి ఆ గ్రామంలో 793 ఓట్లు లభించాయి. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలను ఆప్యాయంగా పలుకరించి వారితో ప్రత్తిపాటి ఫొటోలు దిగారు. ఉదయం నుంచే ప్రత్తిపాటి నివాసం అభిమానులతో కిక్కిరిసి పోయింది. పట్టణ పోలీసు స్టేషన్ సీఐ, ఎస్‌ఐలు, ఉద్యోగులు సహా పలువురు ఆయనను కలసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

శావల్యాపురం మండలంలో కూటమి ప్రభంజనం

శావల్యాపురం, జూన్ 6: తెలుగుదేశం పార్టీకి కంచుకోటలాంటి శావల్యాపురం మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి సత్తాచాటి వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులుకు 4900ఓట్లు మెజారిటీని కట్టబెట్టింది. శావల్యాపురం మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 14 గ్రామ పంచాయతీలలో కూటమి గణనీయమైన మెజారిటీలను సాధించగా ఒక్క గుంటుపాలెంలో మాత్రమే వైసీపీ స్వల్ప మెజారిటీ సాధించింది. మండలవ్యాప్తంగా కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులుకి 16,821 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడుకి 11,921ఓట్లు వచ్చాయి.

కూటమి అభ్యర్థి జీవీకి 4900ఓట్ల మెజారిటీ

బొల్లా బ్రహ్మనాయుడు స్వగ్రామమైన వేల్పూరులో కూటమి అభ్యర్థి జీవీకి 660ఓట్లు మెజారిటీ రావడం గమనార్హం. 2014 ఎన్నికలలో శావల్యాపురం మండలంలో టీడీపీకి ఐదువేలు మెజారిటీ వచ్చింది. 2019 ఎన్నికలలో వినుకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైసీపీకి మెజారిటీ వచ్చినా శావల్యాపురం మండలంలో మాత్రం టీడీపీకే 500ఓట్లు మెజారిటీ వచ్చింది. గ్రామ పంచాయతీలవారీగా కూటమి సాధించిన మెజారిటీలు ఇలా ఉన్నాయి.

గ్రామపంచాయతీ	టీడీపీ	వైసీపీ	మెజారిటీ	గ్రామపంచాయతీ	టీడీపీ	వైసీపీ	మెజారిటీ
వేల్పూరు	3136	2476	660 (టీడీపీ)	ముండ్రువారిపాలెం	584	524	60 (టీడీపీ)
ఇర్లపాడు	542	296	246 (టీడీపీ)	శానంపూడి	777	535	242 (టీడీపీ)
పోట్లూరు	1720	973	747 (టీడీపీ)	బొందిలిపాలెం	569	388	181 (టీడీపీ)
కొత్తలూరు	925	476	449 (టీడీపీ)	మతుకుమల్లి	1603	887	716 (టీడీపీ)
శావల్యాపురం	1443	1301	142 (టీడీపీ)	కారుమంచి	2015	1411	604 (టీడీపీ)
కనమర్లపూడి	1065	679	386 (టీడీపీ)	వయ్యకల్లు	589	527	62 (టీడీపీ)
పిచికలపాలెం	803	598	205 (టీడీపీ)	గుంటుపాలెం	445	500	55 (వైసీపీ)
చిన్నకంచెర్ల	605	350	255 (టీడీపీ)	**మొత్తం**	**16,821**	**11921**	**4900 (టీడీపీ)**

సైకిల్‌కి జైకొట్టిన యడ్లపాడు, నాదెండ్ల మండల ప్రజలు

● యడ్లపాడు మండలంలో 5,750 ఓట్లు, నాదెండ్ల మండలంలో 4,267 ఓట్ల ఆధిక్యం

యడ్లపాడు, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో యడ్లపాడు మండల ప్రజలు సైకిల్‌కు జైకొట్టారు. వైసీపీకి కంచుకోటలాంటి కొండవీడు, చెంఘీజ్‌ఖాన్ పేట, మైదవోలు, సొలస గ్రామాల్లో సైతం టీడీపీకి ఆధిక్యం రావడం విశేషం. మండలంలోని 22 గ్రామాల పరిధిలో 57 (58-114) పోలింగ్ బూత్‌లు ఉండగా కేవలం పన్నెండు బూత్‌లలో (67, 73, 82, 86, 95, 97, 101, 102, 107, 108, 109, 112) మాత్రమే వైసీపీకి మెజారిటీ రాగా మిగిలిన 48బూత్‌లలో టీడీపీకి మెజారిటీ లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీకి 5,428 ఓట్లు మెజారిటీ వచ్చింది. మండలంలో మొత్తం ఓటర్లు 44,381 కాగా 39,712 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లలో టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావుకు 22,070 ఓట్లు రాగా.. వైసీపీ అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడుకు 16,642 ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల్లో వైసీపీకి 265ఓట్ల ఆధిక్యం లభించింది. గత ఐదేళ్ళుగా వైసీపీ పాలనలో ఇబ్బందులు పడిన ప్రజలు ఈ ఎన్నికల్లో తమ ఓటుతో ప్రతీకారాన్ని తీర్చుకున్నారు. మున్నెన్నడూ లేనివిధంగా టీడీపీకి భారీ మెజారిటీని కట్టబెట్టారు. వైసీపీకి కారుచోలలో 163, ఉప్పరపాలెంలో 112ఓట్లు ఆధిక్యం లభించింది. యడ్లపాడులోని తొమ్మిది పోలింగ్ కేంద్రాల్లో టీడీపీకి 3,644 ఓట్లు రాగా వైసీపీకి 2,391ఓట్లు వచ్చాయి. ఎన్నడూ లేనివిధంగా గ్రామంలో టీడీపీకి 1,253 ఓట్ల ఆధిక్యం లభించింది. మరో పెద్ద గ్రామమైన తిమ్మాపురంలోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో టీడీపీకి 2,136.. వైసీపీకి 1,573 వచ్చాయి. ఇక్కడ టీడీపీ 563ఓట్ల ఆధిక్యం లభించింది. ఉన్నవలోని నాలుగు పోలింగ్ కేంద్రాలలో టీడీపీకి 1,394 ఓట్లు రాగా వైసీపీకి 1,176 ఓట్లు వచ్చాయి. ఇక్కడ టీడీపీకి 218 ఓట్ల ఆధిక్యం లభించింది. ఉన్నవ శివారు గ్రామమైన మర్రిపాలెంలోని రెండు బూత్‌లలో టీడీపీకి 777, వైసీపీకి 518 ఓట్లు వచ్చాయి. ఇక్కడ టీడీపీకి 259 ఓట్ల ఆధిక్యత లభించింది. సొలస గ్రామంలోని మూడు పోలింగ్ కేంద్రాలలో టీడీపీకి 1,125 ఓట్లు రాగా.. వైసీపీకి 1,148 ఓట్లు వచ్చాయి. కేవలం వైసీపీకి 23ఓట్ల ఆధిక్యం లభించింది. అయితే అదే పంచాయతీ పరిధిలోని కొత్తసొలస గ్రామంలోని రెండు పోలింగ్‌బూత్‌లలో టీడీపీకి 652, వైసీపీకి 536ఓట్లు వచ్చాయి. ఇక్కడ టీడీపీకి 116ఓట్ల ఆధిక్యం లభించింది. ఉప్పరపాలెంలో 2019 ఎన్నికల్లో వైసీపీకి 460 ఓట్లు మెజారిటీ రాగా ఈ సారి టీడీపీ పుంజుకోవడంతో 112 ఓట్లకు పరిమితమైంది. వైసీపీకి కంచుకోటలాంటి మరో గ్రామమైన కొండవీడులోని రెండు పోలింగ్ కేంద్రాలలో టీడీపీకి 938, వైసీపీకి 740 ఓట్లు వచ్చాయి. గ్రామంలో టీడీపీకి 198 ఓట్ల ఆధిక్యం లభించింది. గత ఎన్నికల్లో వైసీపీకి ఇక్కడ 214 ఓట్ల ఆధిక్యం వచ్చింది. దానిని అధిగమించి 198 ఓట్లు మెజారిటీని టీడీపీ సాధించడం విశేషం. అలాగే వైసీపీకి కంచుకోటలాంటి మరో గ్రామమైన చెంఘీజ్‌ఖాన్‌పేటలోని మూడు బూత్‌లలో టీడీపీకి 1,368, వైసీపీకి 851ఓట్లు వచ్చాయి. ఇక్కడ టీడీపీకి 517ఓట్ల ఆధిక్యం లభించింది. 2019 ఎన్నికల్లో ఇక్కడ వైసీపీకి 338ఓట్ల మెజారిటీ లభించింది. జనసేనతో పొత్తు కారణంగా ఇక్కడ టీడీపీకి భారీ ఆధిక్యం లభించింది. కొత్తపాలెంలో టీడీపీకి 294ఓట్ల ఆధిక్యం వచ్చింది. టీడీపీకి మైదవోలులో 132, లింగారావుపాలెంలో 266, వంకాయలపాడులో 135, బోయపాలెంలో 245, గుత్తావారిపాలెంలో 149, దింతెనపాడు 196, జగ్గాపురం 173, జాలాది 201, తుర్లపాడు 210, సందెపూడిలో 406ఓట్ల ఆధిక్యం లభించింది.

నాదెండ్ల మండలంలో ...

నాదెండ్ల, జూన్ 6: మండలంలో మరోమారు టీడీపీ తన సత్తాను చాటుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావుకు 4,267 ఓట్ల మెజార్టీ వచ్చింది. వైసీపీకి ఒకటి రెండు గ్రామాల్లో మాత్రమే ఆశించిన స్థాయిలో మెజార్టీ దక్కగా మిగిలిన గ్రామాల్లో నిరాశే మిగిలింది. మండలంలో మొత్తం 15 గ్రామాల్లో 57 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మేజరు పంచాయతీ గ్రామాలైన సాతులూరులో టీడీపీ 1077 ఓట్ల మెజార్టీ, నాదెండ్లలో 1381 ఓట్ల మెజార్టీ, గణపవరంలో 1117 ఓట్ల మెజార్టీని సాధించింది. కనపర్రులో 598 ఓట్లు, అమీన్‌సాహెబ్‌పాలెంలో 552 ఓట్లు, ఎండుగుంపాలెంలో 535ఓట్లు, సంక్రాంతిపాడులో 210ఓట్ల మెజార్టీని టీడీపీ సాధించింది. అప్పాపురంలో మాత్రం కేవలం 87ఓట్ల స్వల్ప మెజార్టీ దక్కగా చందవరంలో 114 ఓట్లు మెజార్టీ సాధించింది. వైసీపీకి తూబాడులో 54, ఇర్లపాడులో 51ఓట్ల స్వల్ప ఓట్ల మెజార్టీలు మాత్రమే దక్కాయి. కాగా ఆశించిన స్థాయిలో చిరుమామిళ్ళలో 613, గొరిజవోలులో 375 ఓట్ల మెజార్టీ వైసీపీ సాధించింది. జంగాలపల్లిలో 174, బుక్కాపురంలో 137 మెజార్టీని వైసీపీ సాధించింది. వైసీపీకి పట్టు ఉన్న పలు గ్రామాల్లో ఆశించిన స్థాయిలో మెజార్టీ దక్కలేదు.

ఇస్సపాలెంలో రేషన్ బియ్యం తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు



ఇస్సపాలెంలో గ్రామస్థులు పట్టుకున్న రేషన్ బియ్యం

నరసరావుపేట టౌన్, జూన్ 6: మండలంలోని ఇస్సపాలెంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యంను గురువారం గ్రామస్థులు పట్టుకున్నారు. వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది బస్తాల రేషన్ బియ్యంను అడ్డగించడంతో వారు బియ్యం బస్తాలను అక్కడే వదలి వెళ్లిపోయారు. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి వీఆర్‌వో సువర్ణ లక్ష్మి వచ్చారు. అయితే ఈ బియ్యం స్కూల్ సంబంధించినవని ఆమె తెలిపారు. అయితే గ్రామస్తులు డీటీని సంప్రదించగా ఎలాంటి స్టాక్ ఆన్‌లైన్‌లో లేవని చెప్పారని అన్నారు. విలేకరులు తహసీల్దార్ హరిబాబును ఫోనులో సంప్రదించగా పూర్తి వివరాలు తెలియలేదని, విచారణ చేస్తామని తెలిపారు.



గురువారం టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న డాక్టర్ అరవిందబాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు - నరసరావుపేట

మద్దిరాలలో తెలుగు యువత వినూత్న ఫ్లెక్సీ



మద్దిరాలలో మస్తాన్ ఇంటి సమీపంలో వెలసిన ఫ్లెక్సీ

చిలకలూరిపేట, జూన్ 6: చిలకలూరిపేట మండలం మద్దిరాలలో గ్రామ తెలుగు యువత గురువారం వినూత్నమైన ఫ్లెక్సీని నెలకొల్పారు. గ్రామానికి చెందిన ఆరా మస్తాన్ ఈ ఎన్నికల్లో వైసీపీకి అత్యధిక మెజార్టీ లభిస్తుందని ఎగ్జిట్ పోల్స్‌లో ఇచ్చిన విషయం విదితమే. ఐతే ఆయన ఇచ్చిన సర్వే తుస్సుమంది. ఆయన సర్వేను నమ్ముకొని పెద్ద మొత్తంలో బెట్టింగ్‌లు పెట్టి ఎంతోమంది డబ్బు పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఆరా మస్తాన్ ఇంటికి సమీపంలో ఆ గ్రామ తెలుగు యువత ఒక ఫ్లెక్సీని నెలకొల్పింది. ఎగ్జిట్ పోల్స్‌లో కేకే సర్వే ఫలితాలు ఖచ్చితంగా ఉన్నాయని, ఆ సర్వేను నిర్వహించిన కిరణ్ కొండేటికి శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీని నెలకొల్పారు. కాగా మద్దిరాల గ్రామంలో ఉన్న ఒకే ఒక్క పోలింగ్ బూత్ 223లో మొత్తం 963 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీడీపీకి 637 ఓట్లు, వైసీపీకి 313 ఓట్లు లభించాయి. ఈ గ్రామంలో టీడీపీకి 324 ఓట్ల ఆధిక్యత లభించింది. ఆరా స్వగ్రామంలో టీడీపీ యువత ఈ ఫ్లెక్సీని నెలకొల్పటాన్ని పలువురు ఆసక్తిగా చూస్తున్నారు.



కోటప్పకొండలో పూజల్లో పాల్గొన్న మహిళలు

త్రికోటేశ్వరుని సన్నిధిలో మొక్కు తీర్చుకొన్న మహిళలు

కారుమంచి నుంచి కాలినడకన కోటప్పకొండకు

కారుమంచి (శావల్యాపురం) జూన్ 6: సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి చారిత్రాత్మకమైన విజయాన్ని సాధించడంతో మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన 30మంది మహిళలు గురువారం కాలినడకన కోటప్పకొండకు వెళ్ళి త్రికోటేశ్వరుని సన్నిధిలో మొక్కుబడులు తీర్చుకొన్నారు. గురువారం ఉదయం కారుమంచి నుండి బయలుదేరిన మహిళలు సంతమాగులూరు, మిన్నెకల్లు, పమిడిమర్రుల మీదుగా కోటప్పకొండకు చేరుకొన్నారు. త్రికోటేశ్వరుని సన్నిధిలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి టెంకాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 164 అసెంబ్లీ సీట్లు, 21 లోక్‌సభ సీట్లలో విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబును సీఎంగా, జీవీని ఎమ్మెల్యేగా చూడాలన్న కోరిక నెరవేరిందన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు, అభిమానులు

యడ్లపాడు, జూన్ 6: తెలుగుదేశం పార్టీ కూటమి అఖండ విజయం సాధించడంతో పడ్డ కష్టానికి ఫలితం దక్కిందని మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బోయపాలెం పార్వతీదేవి ఆలయంలో మొక్కులు చెల్లించారు. గ్రామానికి చెందిన బొల్లినేని హనుమంతరావు కూటమి గెలుపుతోపాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ప్రధానిగా మోదీ పదవులు చేపట్టాలని మొక్కుకున్నానన్నారు. తాను కోరుకున్నట్లుగా జరగడంతో అమ్మవారిక 108కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నానన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ కుర్రా రత్తయ్య, పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


కనకదుర్గ అమ్మవారికి జనసేన నాయకుల పూజలు

వినుకొండ టౌన్, జూన్ 6: పట్టణంలోని విష్ణుకుండీనగర్‌లోని శ్రీకనక దుర్గ అమ్మవారి 15 వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం జనసేన పార్టీ నియోజకవర్గం సమన్వయ కర్త నాగశ్రీను రాయల్ మిత్రులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులతో పాటు, వినుకొండలో జీవీ ఆంజనేయులు అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట వెంకటేశ్వర్లు, రమాదేవి, రాయుడు, తిరుమలశెట్టి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు: ఎంఈవో

బొల్లాపల్లి, జూన్ 6: స్థానిక మండల కేంద్రమైన బొల్లాపల్లి ఎస్సీ కాలనీలో పాఠశాల అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులతో పాటు హోంవర్క్ చేయించటం జరుగుతుందని ఎంఈవో పార్వతి గురువారం తెలిపారు. అసిస్ట్, ఇటలీ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణ తరగతులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయంత్రం వేళ 50మంది పిల్లలకు నోట్ బుక్స్ ఏర్పాటు చేయటం, నాణ్యమైన న్యూట్రిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 24వరకు జరిగే ఈ శిక్షణ శిబిరంను విద్యార్థులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్ట్ కో-ఆర్డినేటర్ కే శ్రీనివాసరావు, కరిముల్లా, పీఆర్‌పీలు షేక్ ఖాశింవలి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



షేక్ భాజి (ఫైల్ ఫొటో)

వినుకొండ టౌన్, జూన్ 6: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని నూజండ్ల రైలు గేటు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సుబ్బారావు తెలిపిన వివరాలను పరిశీలిస్తే వినుకొండలోని కళ్యాణి పురికాలనీలో నివాసం ఉండే వివాహితుడైన షేక్ బాజి (30) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవనం సాగిస్తున్న నేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, మృతుని శరీరంపై ఉన్న ఆధారాలను గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

● ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి

యడ్లపాడు, జూన్ 6: మండలంలోని వంకాయలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు గ్రామానికి చెందిన మక్కెళ్ళ చెంచయ్య, అంకమ్మ దంపతులకు కుమారుడు రాకేష్‌బాబు (21), కుమార్తె ఉన్నారు. అవివాహితుడైన రాకేష్‌బాబు బేల్‌దారు మేస్త్రీగా పనిచేస్తుంటాడు. బుధవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై వంకాయలపాడు వైపు వెళ్లాడు. వంకాయలపాడు గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఆరులైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, సర్వీసు రోడ్డుకు మధ్యన ఉన్న డ్రెయిన్‌లోకి దూసుకెళ్ళింది. దీనితో రాకేష్ తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది గాయపడిన రాకేష్‌ను అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు. తల్లి అంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని విచారిస్తున్నామన్నారు.